

యోగా డేపై సమీక్ష



యోగా డే నిర్వహణపై మంగళవారం ఉదయం బీచ్‌రోడ్డులోని సాగరిక కన్వెన్షన్ హాలులో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. -వార్త 6వ పేజీలో

లోకేశ్ ప్రజా దర్బార్

పార్టీ కార్యాలయంలో వినతుల స్వీకరణ

- కొన్నింటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు
- ఇంటర్ జోనల్ బదిలీలు చేయాల్సిందిగా డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల వినతి
- పదోన్నతులు కల్పించాల్సిందిగా తెలుగు పండిట్ల విజ్ఞాపన
- లంకెలపాలెంలో కోనేరు అభివృద్ధిలో నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేయండి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు పండిట్‌లు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఉదయం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతులు స్వీకరించిన ఆయన... పలు సమస్యలపై అక్కడికక్కడే సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

తమకు నెలవారీ జీతం చెల్లించడంతోపాటు ఇంటర్ జోనల్ బదిలీలకు అవకాశం కల్పించాలని ఏపీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపక అసోసియేషన్ వినతిపత్రం అందజేయగా, సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడతారని భరోసా ఇచ్చారు. ఇటీవల తన భర్త చనిపోయారని, ముగ్గురు పిల్లలు ఉన్నారని పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలని నగరానికి చెందిన అవ్వా కాంతం వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు కల్పించాలని పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న తెలుగు పండిట్లు కోరారు. గడచిన ఐదేళ్లలో నాలుగుసార్లు తమను బదిలీ చేసి ప్రస్తుతం విశాఖ డీఈవో పూల్‌లో కొనసాగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమను పనిచేసే చోట స్థిరంగా ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 2020 ఫిబ్రవరిలో విపక్ష నేతగా ఉన్నప్పుడు నారా చంద్రబాబునాయుడును వైసీపీ నాయకులు ఎయిర్‌పోర్టులో అడ్డుకుని నానా బీభత్సం సృష్టించారని, దీనిపై పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదుచేసి చేతులు దులుపుకున్నారని విశాఖ టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి ఫిర్యాదుచేశారు. దీనిపై మరోసారి విచారణ జరపాలని కోరారు.

కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించండి

ఆనందపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించిన 2.5 ఎకరాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో తనకు పసుపు-కుంకుమ కింద ఇచ్చిన 1.09 ఎకరాలు ఉందని, అయితే 2022లో రీసర్వే నిర్వహించిన తరువాత ఎఫ్ఎంబీలో సదరు భూమిని తప్పుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని నగరంలోని శాతవాహన నగర్‌కు చెందిన వై.వసంతలక్ష్మి వినతిపత్రం అందజేశారు. ఎఫ్ఎంబీలో తప్పులు సరిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నగర శివారు లంకెలపాలెంలో కోనేరు అభివృద్ధి పనుల్లో రూ.1.2 కోట్లు గోల్‌మాల్ జరిగిందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలని కోరారు. వినతులు స్వీకరించిన లోకేశ్, ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా లోకేశ్‌ను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితో ఆయన ఫొటో ... మిగతా 6వ పేజీలో

పల్లా కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి నారా లోకేశ్

సీతంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావును విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఈ నెల ఏడో తేదీన శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే సింహాచలం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరంలోని సీతంపేట రాజేంద్రనగర్‌లో గల పల్లా శ్రీనివాసరావు నివాసానికి మంగళవారం ఉదయం మంత్రి లోకేశ్ వెళ్లారు. తొలుత సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింహాచలం మంచికి మారు పేరుగా నిలిచారని, విశాఖ-2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారంటూ ఆయన ... మిగతా 6వ పేజీలో

రెవెన్యూలో బదిలీలు

- 12 మంది తహశీల్దార్లు, 28 మంది డీటీలు
- 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లు
- ట్రెజరీలో బదిలీలపై విమర్శల వెల్లువ

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రెవెన్యూకు సంబంధించి 85 మందిని బదిలీ చేశారు. వీరిలో 12 మంది తహశీల్దార్లను సోమవారం రాత్రి బదిలీ చేయగా, 28 మంది డిప్యూటీ తహశీల్దార్లు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు అటెండర్లకు స్థానచలనం కల్పిస్తూ అర్ధరాత్రి తరువాత ఉత్తర్వులు వెలువరించారు. పలువురిని విశాఖ జిల్లా నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు పంపగా, అల్లూరి, అనకాపల్లి నుంచి కొందరిని విశాఖకు బదిలీ చేశారు. అయితే విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొద్దిమందిని తప్ప మిగిలిన వారిని కదిలించలేదనే వాదన రెవెన్యూ ... మిగతా 6వ పేజీలో



జడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ ప్రారంభం కాకపోవడంతో ఉపాధ్యాయుల పడిగాపులు

ఐసీడీఎస్‌లో పలువురి బదిలీలు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో 12 మంది సూపర్ వైజర్లు, ఇద్దరు సీడీపీవోలు, మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ అయ్యింది. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీలు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఆర్డీ కార్యాలయ పరిధిలో 1,040 దరఖాస్తులు

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో బదిలీలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకూ 27 కేడర్లకు చెందిన 1,040 మంది ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం, బుధవారాల్లో అభ్యంతరాలను అధికారులు స్వీకరిస్తున్నారు. మరో మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియ ముగిస్తుందని అధికారులు వెల్లడించారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరినీ బదిలీ చేస్తున్నట్టు ఆర్డీ రాధారాణి వెల్లడించారు.


టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- సాంకేతిక సమస్యతో సర్వర్ పనిచేయకపోవడమే కారణం

మహారాణిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

సెకండరీగ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌కు సాంకేతిక సమస్య ఎదురైంది. రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యా శాఖ సర్వర్‌లో ఏర్పడిన ఇబ్బంది వల్ల కౌన్సెలింగ్ వాయిదా పడింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం మంగళవారం కౌన్సెలింగ్ ప్రారంభం కావాలి. ఐదారు రోజులు చేపట్టాల్సిన ఈ ప్రక్రియకు సంబంధించి జడ్పీ సమావేశ మందిరాన్ని వేదికగా ఖరారు చేశారు. తొలిరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని విద్యా శాఖ ప్రకటించింది. సీనియారిటీ జాబితా ప్రకారం ఒకటి నుంచి 500 నంబర్ వరకూ తొలి రోజు బదిలీలు చేపడతామని వెల్లడించడంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి టీచర్లు హాజరయ్యారు. బదిలీలు మాన్యువల్‌గా చేపట్టాల్సి ఉన్నా సీనియారిటీ జాబితా ప్రదర్శన, ఆప్షన్స్ కోరుకున్న తరువాత వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌కు సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తూ వచ్చారు. సమస్య తొలగకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో బదిలీ కౌన్సెలింగ్ బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు విద్యా ... మిగతా 6వ పేజీలో

నేత్రపర్వంగా వెంకన్న తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) స్వామివారు

పోర్టు ఏరియాలోని కొండ శృంగమణి పర్వతంపై గల వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సముద్రంలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో కొండ పైనుంచి పల్లకిలో సాగరతీరం వరకూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. పోర్టు అథారిటీ సమకూర్చిన లాంచీలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు. - మహారాణిపేట/ఆంధ్రజ్యోతి

నేటి నుంచి నీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

- జీతాల పెంపునకు చాలాకాలంగా డిమాండ్
- ఆరునెలల కిందట కౌన్సిల్ ఆమోదం
- ఆడిట్ అభ్యంతరంతో నిలిచిపోయిన వైనం
- నేటి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్టు కలెక్టర్‌కు నోటీస్ అందజేత

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలోని అవుట్ సోర్సింగ్ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. సమ్మె కారణంగా నగరంలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో కనీసం పదేళ్ల అనుభవం కలిగి, టెక్నికల్ విధులు నిర్వర్తిస్తున్న 900 మందికి రూ.ఆరు వేలు చొప్పున వేతనం పెంచాలని కార్మిక సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై గత ఏడాది డిసెంబరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో లోతుగా చర్చించిన సభ్యులు వేతనాల పెంపునకు ఆమోదం తెలిపారు. ఇన్‌చార్జి కమిషనర్ కూడా ఆమోదించారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి రూ.6 వేల చొప్పున మే నెల నుంచి పెంచుతూ బిల్లును ఆప్కోస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జీతాలను జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి, బిల్లు ఆడిట్ విభాగానికి రాగా, అక్కడి అధికారులు పరిశీలించి, కౌన్సిల్, ఇన్‌చార్జి కమిషనర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కూడా ఉండాలని పేర్కొంటూ తిరిగి ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు పంపించింది. దీంతో వారి జీతాల పెంపు నిలిచిపోయింది. అయితే వారికి గతంలో మాదిరిగా జీతం ఇవ్వడానికి కూడా సాంకేతికంగా ఇబ్బంది రావడంతో ఈనెల ఒకటిన జీతాలు జమ కాలేదు. ఆ 900 మంది కార్మికులకే కాకుండా మిగిలిన సుమారు ఏడు వేల మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా జీతాలు నిలిచిపోవడంతో అంతా గగ్గోలు పెడుతున్నారు. తమకు జీతాలు పెంచేందుకు కౌన్సిల్‌తోపాటు ఇన్‌చార్జి కమిషనర్ ఆమోదించినప్పటికీ రాష్ట్రప్రభుత్వ ఆమోదం కావాలని కోరడం సరికాదని, తమకు పెరిగిన జీతాలను మే నెల నుంచి ఇవ్వకపోతే ... మిగతా 6వ పేజీలో

అక్రమార్కులకు మహా దన్ను!

నాలా పన్ను చెల్లించకపోయినా భవనాలకు ప్లాన్‌ల జారీ

- కొందరికి ఆక్యుపేషన్ సర్టిఫికెట్లు కూడా ఇచ్చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కూర్మన్నపాలెంలోని ఎంవీవీ, ఎంకే అపార్టుమెంట్ యాజమాన్యం రూ.7.9 కోట్లు నాలా బకాయి ఉన్నా ప్లాన్, ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ
- వారం రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సీసీపీని ఆదేశించిన మేయర్
- నగరంలో సుమారు రూ.700 కోట్లు వరకూ నాలా బకాయిలు



కూర్మన్నపాలెంలోని ఎంవీవీ, ఎంకే పార్కు అపార్టుమెంటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అక్రమ నిర్మాణదారుల పట్ల జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు అమితమైన ప్రేమ కనబరుస్తున్నారు. తమను ప్రసన్నం చేసుకున్న బడా బిల్డర్లకు నిబంధనలతో పనిలేదన్నట్టుగా మేలు చేస్తున్నారు. కూర్మన్నపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మించిన ఎంవీవీ, ఎంకే పార్కు (భారీ అపార్టుమెంటు)కు సంబంధించి రూ.7.9 కోట్లు నాలా బకాయి ఉన్నా ప్లాన్ జారీచేయడంతో పాటు, నిర్మాణం పూర్తికాగానే ఆక్యుపేషన్ సర్టిఫికెట్ (ఓసీ) కూడా ఇచ్చేశారు. ఇలాంటి నాలా బకాయిలు జీవీఎంసీ పరిధిలో రూ.700 కోట్లు వరకూ ఉన్నట్టు చెబుతున్నారు.

జీవీఎంసీ పరిధిలో ఎవరైనా భవన నిర్మాణాలు చేపట్టాలంటే టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ముందుగా ఆన్‌లైన్‌లో ప్లాన్ కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేస్తారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి అన్ని డాక్యుమెంట్‌లు సరిగా ఉన్నాయా?, ఏమైనా వివాదాలు ఉన్నాయా? ... మిగతా 6వ పేజీలో

ఏడాదిలో రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే ధ్యేయం
- పరిశ్రమలకు నీటి చార్జీలు తగ్గించే ప్రయత్నం
- ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి టీజీ భరత్ -వార్త మెయిన్‌లో



ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 ప్రదానోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి టి.జి.భరత్. పక్కన ఎంపీ శ్రీభరత్ ఉన్నారు.

వర్షం



విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):

మూడు, నాలుగు రోజుల నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులు సేదదీరేలా మంగళవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘాలు ఆవరించడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. తొమ్మిది గంటల నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో అరగంటపాటు వర్షం కురిసింది. ఆనందపురంలో 37.5, ఎండాడలో 23.25, సాగర్‌నగర్‌లో 23 మి.మీ. వర్షపాతం నమోదైంది.


రోడ్డు తవ్వకంతో తెగిన భూగర్భ పైప్‌లైన్లు

రహదారి ధ్వంసం

ఎండాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ ముబారక్ లేఅవుట్‌లో మసీదు వద్ద ఉన్న రహదారిని ఇష్టానుసారం తవ్వేయడం తో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడు తున్నారు. మసీదు వాడుక నీరు వెళ్లేందుకు జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు రోడ్డును తవ్వి నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిని అడ్డదిడ్డంగా తవ్వేయడంతో కింద వున్న భూ గర్భ విద్యుత్ కేబుళ్లు, మంచినీటి పైపులైన్లు ధ్వంసం అయినట్టు చెబుతున్నారు. రహదా రిని తవ్వినప్పుడు విద్యుత్ వైర్లు బయటకు వచ్చిన మరుక్షణం సరఫరా నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. రోడ్డును ఇష్టాను సారం తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గీతం కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు

సాగర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటే షన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్టు వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటే షన్ ర్యాంకింగ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. రాజా ప్రభు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గీతం వర్సిటీకి ఎన్‌బీఏ గుర్తింపు లభించడం అంత ర్జాతీయంగా వర్సిటీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. దేశంలో అతికొద్ది వర్సిటీలకు మాత్రమే ఎన్‌బీఏ గుర్తింపు ఉందన్నారు. కోర్సుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల్లో నైపుణ్యాలతో పాటు పలు అం శాలు పరిశీలించిన అనంతరం ఎన్‌బీఏ నిపుణుల కమిటీ ఈ గుర్తింపును ప్రకటించిందన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం

భీమునిపట్నం (రూరల్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునఃప్రారంభ మయ్యే నాటికి విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని ఎంఈఓ పి. శివరాణి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో 12 నుంచి 20వ తేదీలోపు కిట్లు మొత్తం విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. యూనిఫారం, బెల్టు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్‌లు, బ్యాగులు, బూట్లు, సాక్సులు, డిక్షన రీలు కిట్లలో ఉంటాయని చెప్పారు.

నేడు భీమిలి మండల సర్వ సభ్య సమావేశం

భీమునిపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరుగనున్నట్టు ఎంపీడీవో ఎన్. హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్ర తినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

తీరంలో చిరుజల్లులు

సాగర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, రుషి కొండలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. ఆకాశం దట్ట మైన మేఘాలతో కమ్ముకుని వుంది. సాగర్‌న గర్, రుషికొండ తీరంలో సముద్ర అలలు ఎగసి పడుతున్నాయి. సోమవారం తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు చిరు జల్లులతో సేదతీరారు.

ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం

పద్మనాభం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం ఎస్ఐ జె. సురేష్ చెప్పారు. అయినాడ గ్రా మానికి చెందిన కోరాడ రాజన్న బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో మంగళవారం దాడి చేసి, అతని వద్ద ఆరు సీసాలు పట్టుకున్నామన్నారు. బాటిళ్లు స్వాధీ నం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

లోకేశ్ ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

దీంతో, పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను జి ల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోల శ్రీబాలవీరాంజనే యస్వామి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మె ల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబా బు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇంకా దాడి వీరభద్రరావు, బు ద్ధా నాగజగదీష్, దాడి రత్నాకర్, మహ్మద్ న జీర్, పీవీజీ కుమార్, నాయకులు కలిశారు.

పల్లా కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ పరామర్శ

... 5వ పేజీ తరువాయి

సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. ప ల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యుల ను పరామర్శించి ధైర్యం చెప్పారు. సింహాచ లం వ్యవహిత పల్ల దగ్గర ప్రసాద సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీబాల వీరాంజనే యస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధు లు, నాయకులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక
- ఆనందపురం మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారదా ప్రియాంక

ఆనందపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అన్నారు. మంగళవా రం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరి గింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయ తీల్లో రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టిసా రించాలన్నారు. సమస్యలు ఎదురయ్యే ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీఓ డాక్టర్ వి. జానకి మాట్లాడుతూ ఈనెల 21న జరిగే యోగా దినోత్సవంతో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. అనంతరం రెవెన్యూ, ఆరోగ్యం, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సర ఫరా శాఖల పనితీరుపై సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా ముకుందపురం సర్పంచ్ కలిమి గంగరాజు మాట్లాడుతూ తమ పంచా యతీలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టా లని కోరారు. గంభీరంలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవనం నిర్మించినా ప్రారంభించకుండా, నిర్వాహకులకు అప్పగించడంపై మండల పరిషత్ ఉపాధ్య క్షుడు బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతుకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాను నిషేధించాలి

భీమిలిలో తెలుగు మహిళల భారీ ర్యాలీ


నిరసన ప్రదర్శన ర్యాలీలో పాల్గొన్న తెలుగు మహిళలు

భీమునిపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచే వ్యా ఖ్యానాలకు వేదికగా నిలిచిన సాక్షి మీడియాను నిషేధించాలని తెలుగు మహిళలు నిరసన ప్రదర్శన చేప ట్టారు. ఈమేరకు మంగళవారం వారు భీమిలి ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి చిన్నబజారు జంక్షన్, కాలేజీ రోడ్, బొక్కి డొర వీధి మీదుగా గంట స్తంభం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వర్షం పడుతున్నా, లెక్కచేయకుండా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా మహిళా నేతలు మాట్లాడుతూ డిబేట్ పేరుతో సాక్షి యాంకర్ కొమ్మినే ని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజు మహిళల మనోభావాలు దెబ్బతీసే లా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రాజధాని అమరావతిపై అక్క సుతోనే సాక్షి మీడియా కుట్రకు తెర తీసిందని ఆరోపించారు. ఈ కుట్ర వె నుక మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతిరెడ్డి ఉన్నారని చెప్పారు. మహిళల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన బాధ్యు లను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో మళ్లీ ఇ టువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరా రు. అనంతరం గంట స్తంభం జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు.

అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 (అనకాపల్లి) కమిషనర్‌గా కె.చక్రవర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచే సింది. జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై జీవీఎంసీలో పోస్టింగ్ ఇచ్చింది. అలాగే విజ యనగరం కో-ఆపరేటివ్ శాఖలో ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.నాస్సాని నాయుడును డిప్యూటేషన్‌పై జీవీఎంసీ డీసీఓగా నియమించింది. ప్రస్తుతం డీసీఓగా పనిచేస్తున్న డి.లక్ష్మి వచ్చే నెల 31న ఉద్యోగ విరమణ చేయనుం డడంతో ఆమె స్థానంలో చేరాలని సూచించింది. వెయిటింగ్‌లో ఉన్న గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లు టి.టి.రత్నకుమార్‌తోపాటు పీవీ ప్రసన్నవాణికి జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్లుగా పోస్టింగ్ ఇచ్చింది. కాగా విశాఖపట్నం సూ పర్ బజారు మేనేజింగ్ డైరెక్టర్‌గా వి.శ్రీరామమూర్తి మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. బదిలీలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా స హకార శాఖాధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ ఎండీగా నియ మించారు.

మూడో విడత చందనం సమర్పణకు ఏర్పాట్లు


చందనపు ముద్దలో చూర్ణాలను మిళితం చేస్తున్న ప్రధానార్చకుడు సీతారామాచార్యులు

సింహాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి మూడో విడత చందనం సమర్పణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మాదిరిగానే జ్యేష్ఠ మాస శుక్లపక్ష పౌర్ణమి నాడు అనగా బుధవా రం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం మూడవ విడతగా మూడు మణుగుల (సుమా రు 125 కిలోల) చందనపు ముద్దను స్వామివా రికి సమర్పించనున్నారు. ఈమేరకు మంగళ వారం ఉదయం ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు బాండాగారం నుంచి అర గదీసిన చందనపు ముద్దను బయటకు తీసి, అందులో సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళి తం చేశారు. కాగా చందనం సమర్పణ దృష్ట్యా బుధవారం తెల్లవారుజామున, సుప్రభాతసేవ, ఆరాధన, ఉదయం నిత్య కల్యాణం, సహస్రనా మార్చన, గరుడసేవ వంటి ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు. అలాగే స్వామివారి దర్శనాలు ఉదయం 7 గంటల తర్వాత లభిస్తాయని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కాపులుప్పాడ 33/11 కేవీ, 11 కేవీ ఉప్పాడ ఫీడర్, 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడర్, 33/11 కేవీ భీమిలి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా బుధవారం ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయను న్నట్టు విశాఖ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మంగ మారిపేట, రామాద్రి, తిమ్మాపురం, కాపుల ఉప్పాడ, ఉప్పాడ, కెనరాపా లెం, రెడ్డిపాలెం, సోమన్నపాలెం, కళా గ్రామం, గ్రీహౌండ్స్, నేరెళ్లవ లస, జగనన్న కాలనీ, వాండెకాలనీ, మార్టిన్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా నృసింహ జయంత్యుత్సవం

సింహాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నారసింహుని అవిర్భావ తిథి చతుర్దశి పురస్కరించుకుని కృష్ణాపురంలోని నృసింహవనంలో నృసింహ జయంత్యుత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వనంలో నృసింహ విగ్రహం వద్ద లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో ఆలయ వైదికులు శ్రీకారం చుట్టి, షోడశోపచారాల పూజ లు జరిపారు. ఈ సందర్భంగా నారసింహ అవిర్భావ మట్టాన్ని పారా యణ చేశారు. ప్రత్యేక నివేదనలు జరిపిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్, సిబ్బంది మూలా వాసు, జి. కొండబాబు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల మరమ్మతుకు రూ.39 లక్షలు మంజూరు

పద్మనాభం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగునీటి చెరువులు, కాలువల మరమ్మతుకు నీటిపారుదల శాఖ వార్షిక నిర్వ హణ నిధుల నుంచి రూ. 39 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రివాన్‌జీ కాలువ పూడికతీతకు రూ. 7 లక్షలు కేటాయించగా ఇప్పటికే పనులు చేపట్టారు. పొట్నూరు నూకాంబిక చెరువు పూడికతీ తకు రూ. 5 లక్షలు, విలస్వాన్‌పాలెం ఉలవ కాలువ, చిట్టికాలువ పూ డికతీతకు రూ.6లక్షలు, కలిగాడ కృష్ణంరాజు చెరువు పూడిక తొలగిం పునకు రూ.7లక్షలు, విజయరాంపురం వద్ద దోసపాత్రుని గెడ్డ ముడు ములు, రక్షణ గోడ, యాప్రాన్ నిర్మాణాలకు రూ. 7 లక్షలు, కృష్ణాపు రం కాలువ పూడిక తొలగింపునకు రూ. 7 లక్షలు ఖర్చుగా కేటాయిం చారు. ఈ పనులు పూర్తి చేసి ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీరందించడానికి సమాయత్తమవుతున్నారు.

యోగా డే నిర్వహణపై మంత్రి లోకేశ్ సమీక్ష

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని అధికారులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. యోగా డే వేడుకలపై మంగళవారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ సాగరిక కన్వెన్షన్ హాల్‌లో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదో చారిత్రక కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ వర్షం పడితే ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, విప్‌లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామ కృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారి

విశాఖలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేదు కలకు రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎంటీ కృష్ణబాబు ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన 247 కం పార్టుమెంట్లలో ప్రజలకు ఆరోగ్యం కలగకుండా చూసేందుకు ఒక్కొక్క గెజిటెడ్ అధికారికి బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్‌మెంట్లోకి అనుమతి స్తామన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం రెండు వేల మంది యోగా ఇన్ స్ట్రక్టర్లను ఎంపిక చేశామని, వారందరిని ముందురోజు రాత్రి ఏయూ గ్రౌండ్స్‌కు రప్పిస్తామన్నారు. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్సుల ను సిద్ధం చేశామని, హాజరయ్యే వారందరికీ వ్యాక్స్ టీషర్ట్ అయా కంపా ర్ట్‌మెంట్ వద్ద అందించనున్నట్టు తెలిపారు. 1400 బయో టాయ్‌లెట్లను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచి వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, ఎనిమిది వేల ప్రైవేటు, స్కూలు బస్సులు సిద్ధం చేసినట్టు తెలిపారు.

వైభవంగా పైడితల్లమ్మ వార్షిక పండగ


పురవీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు


అమ్మవారికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

సింహాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పు పైడి తల్లమ్మ వార్షిక పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్స వాన్ని పురస్కరించుకుని వేకువజా ము నుంచే అడివివరం, విజినిగిరిపా లెం తదితర గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పూజలు జరిపారు. పిల్ల లు, కోళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం శత కం పట్టు వద్ద ఉండే వంశీయులు ప్రధాన తల్లి గరగను శిరస్సున ధాల్చగా, మరికొన్ని గరగలను గ్రామానికి చెందిన భక్తులు తలపై పెట్టు కుని దప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు చేప ట్టారు. శతకం పట్టు నుంచి బయలుదేరిన ఊరే గింపు రామాలయం వీధి, రాజావీధి, సింహాచ లం ప్రధాన కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న ఆలయానికి చేరుకుంది. జిల్లా నలుమూ లల నుంచి తరలివచ్చిన భక్తులతో సింహాచలం ప్రధాన కూడలి కిటకిటలాడింది. ఊరేగింపు పొడ వునా భక్తులు వీధుల వెంట అమ్మవారికి స్వాగ తం పలికారు. సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, ఈఈ బి. రాంబాబు పర్యవే క్షణలో ఏఈఓలు ఆనందకుమార్, పిల్లా శ్రీనివా సరావు తదితర సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈఓ సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని సింహాచలం దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. అలాగే ఉద యం నుంచి సాయంత్రం వరకు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు సుమారు పంద కిలోల పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఊరేగిం పులో విజయనగరానికి చెందిన కళాకారుల పులివేషాలు, తప్పెటగుళ్లు, చెక్క భజనలు, తీన్ మార్, కేరళ వాయిద్యాలు వంటి పలు సంప్ర దాయ కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. కాగా తెల్లవారుజామున అమ్మవారి తొలేళ్ల ఉత్సవంలో అంజలి రథం, మేలాల ఊరే గింపు పూజారి వంశీయులు, ఉత్సవ కమిటీ సభ్యులు లండ వెంకటరమణ సారధ్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

అక్రమార్కులకు మహా దన్ను!

... 5వ పేజీ తరువాయి

అనేదానితోపాటు బాకీపత్రంలో వీఎల్‌టీ, ఆదే పాత ఇల్లు కూలగొట్టి కొత్తగా నిర్మిస్తే ఇంటి పన్ను పూర్తిగా చెల్లించారా, లేదా.. అనేది తనిఖీ చేస్తారు. అదే వ్యవసాయ యోగ్య మైన భూమిలో నిర్మాణానికి ప్లాన్ పెడితే మాత్రం భూ వినియోగ మార్పిడి (నాలా) ఫీజు రెవెన్యూ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. నాలా ఫీజు కట్టిన రశీదుతోపాటు వీఎల్‌టీ కింద జీవీఎంసీకి చెల్లించిన ఫీజు రశీదులను దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయా లి. ఆలా అయితేనే ప్లాన్ దరఖాస్తును పరిగణ నలోకి తీసుకుని, నిర్మాణానికి అనుమతిస్తారు. అలాకాకుండా నాలా ఫీజు రశీదు లేకపోతే మాత్రం ప్లాన్ దరఖాస్తును వెనక్కి పంపించే యాలి. ఒకవేళ భవన నిర్మాణదారుడు తాను నాలా ఫీజు తర్వాత చెల్లించి రశీదుని అప్‌లోడ్ చేస్తానని హామీ పత్రం అందజేస్తే మాత్రం ఆదే పరతును నోటిఫైల్‌లో రాసి ప్లాన్‌ను అనుమతిస్తారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసేలోపు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఓసీ జారీచేయరు. ఓసీ లేకపోతే ఇంటి పన్ను రెట్టింపు విధించడంతో పాటు జీవీఎంసీకి మార్టిగేజ్ చేసిన ప్లాట్‌ను రిలీజ్ చేయరు. అయితే కొంతమంది భవన నిర్మాణదారులు, బడా బిల్డర్లు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులను ప్రసన్నం చేసుకుని నాలా ఫీజు చెల్లించకుండా మేనేజ్ చేస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత నాలా ఫీజు చెల్లింపు ప్రస్తావన లేకుం డానే ఓసీని తెచ్చుకుంటున్నారు.

కూర్మన్నపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ స త్యనారాయణ ఎంవీవీ, ఎంకే పేరుతో 9.57 ఎకరాల్లో రెండు వేల ప్లాట్లు కలిగిన గేటెడ్ క మ్యూనిటీ నిర్మించారు. దీనికి 2019లో ప్లాన్ కోసం దరఖాస్తు చేయగా, నాలా ఫీజు కింద ఏడు ఎకరాలకు రూ.7.59 కోట్లు చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు నోట్ ఫైల్‌లో రాశారు. తర్వాత నాలా ఫీజును చెల్లిస్తానని బిల్డర్ నుంచి హామీ పత్రం తీసుకుని ప్లాన్ రిలీ జ్ చేశారు. 2024లో భవన నిర్మాణం పూర్తయింది. అయితే నాలా ఫీజు కట్టకపోయి నాసరే బిల్డర్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దర ఖాస్తు చేయగానే అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికా రులు వెంటనే జారీచేసేశారు. దీనిపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌తోపాటు మరికొందరు ఫిర్యాదు చేయడంతో నాలా ఫీజు కింద రూ.7.59 కోట్లు చెల్లించాలని నోటీసు జారీచేశారు. అయినా ఇంతవరకు నోటీసుని పట్టించుకున్న దాఖలాల్లేవు. పైగా శ్మశాన స్థలా న్ని, ఏలేరు కాలువ బఫర్‌జోన్‌గా మార్చుకున్న స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా గేటెడ్ కమ్యూనిటీ లో పలు అంతర్గత రహదారి కోసం 2,187 గజాల స్థలం విడిచిపెట్టినందుకు పరిహారంగా నాలు గు రెట్లు సెట్ బ్యాక్ ఉల్లంఘనకు టౌన్‌ప్లా నింగ్ అధికారులు అంగీకారం తెలిపారు. ఇదే విషయమై నాలుగు రోజుల క్రితం జరిగిన కౌ న్సిల్ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. దీనికి మేయర్ పీలా శ్రీనివాసరావు స్పందిస్తూ ఎంవీవీ, ఎంకే పార్క్ గేటెడ్ కమ్యూనిటీ ఉల్లంఘనలపై సమాధానం ఇవ్వాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించగా, నాలా ఫీజు కింద రూ.7.9 కోట్లు బకాయి ఉండగానే ఓసీ జారీచేసిన విషయం వాస్తవమే నని సమగ్రవివరాలు జరిపి వారంరోజుల్లోగా తనకు నివేదిక అందజేయాలని సీసీపీని మేయర్ ఆదేశించారు.

రెవెన్యూలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగుల్లో విమర్శిస్తోంది. పలు కారణాలతో కొందరు బదిలీల నుంచి తప్పించుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పెందుర్తి తహశీల్దారు గా నియమితులైన అల్లూరి జిల్లా జీకే వీధి తహశీల్దార్ టి.రామకృష్ణపై పలు ఆరోపణలు ఉన్నాయని,ఇప్పుడి శ్రీకాకుళం జిల్లాలో రాజాం, వంగర, కొత్తూరు మండలాల్లో పనిచేసిన సమ యంలో అక్రమాలకు పాల్పడటంతో ఆయన స స్పెండ్ అయ్యారని అంటున్నారు. అటువంటి అధికారిని పెందుర్తి తహశీల్దార్‌గా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ట్రెజరీ బదిలీల్లో ఒంటెత్తు పోకడలు

జిల్లా ఖజానా కార్యాలయంలో ఐదారు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో అక్రమాలు జరి గాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు.బదిలీల కోసం ఏర్పా టైన కమిటీ సోమవారం రాత్రి చర్చించి ఉత్త ర్వులను స్వల్పంగా సవరించింది. మొత్తం 34 మందిలో ఐదుగురి వ్యవహారంలో పొరపాట్లు సవరించామని ఇన్‌ఛార్జి డీటీవో గోవిందరావు తెలిపారు.అయితే కార్యాలయంలో భారీగా మా మూళ్లు వసూలుచేసే ఉద్యోగిని వెనుకేసుకు వచ్చేప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎస్టేట్ సోర్టింగ్ కింద పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్ల బదిలీలు వివాదా స్పదమయ్యాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నె లకు రూ.16 వేలు, అటెండర్లకు రూ.12 వేలు ఇ స్తున్నారు. అంత తక్కువ వేతనంతో పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఎలా బతుకుతామ ని వారంతా ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి డీ టీవో గోవిందరావు మాట్లాడుతూ అవుట్ సో ర్సింగ్ ఆపరేటర్లు, అటెండర్ల పోస్టులు పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఖాళీగా ఉన్నాయని, అం దుకే వారిని అక్కడకు పంపామన్నారు. అయితే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న విశాఖకు వారం, పది రోజుల తరువాత తీసుకువస్తామన్నారు.

నేటి నుంచి నీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

... 5వ పేజీ తరువాయి

బుధవారం నుంచి సమ్మెకు దిగుతామని పేర్కొంటూ జీవీఎంసీ కాంట్రాక్టు మరియు అవుట్‌సో ర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆనందరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజే శారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.01 గంటలకు కార్మికులంతా టీఎస్ఆర్ కాంప్లెక్స్ లోని ప్రధాన పంప్‌హౌస్ వద్దకు చేరుకోవాలని వాటర్‌సప్లై కార్మికులకు పిలుపునిచ్చారు. మరోవైపు సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి సైతం నీటి సరఫరా విభాగంలో స్కిల్డ్ విధులు నిర్వర్తి స్తున్నవారికి జీతాలు పెంపుదల అమలుచేయాల్సిందేనని, దీనిపై ఇప్పటికే తాము కూడా సమ్మెకు దిగు తామని పేర్కొంటూ అధికారులకు నోటీసు అందజేశారు. దీంతో బుధవారం నుంచి నగరంలో నీటి స రఫరాకు అంతరాయం కలగడం ఖాయమని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

... 5వ పేజీ తరువాయి

శాఖ ప్రకటించింది. అయితే బుధవారం ఒకటో నంబరు నుంచి 300 వరకూ మాత్రమే కౌన్సెలిం గ్ నిర్వహిస్తామని తెలిపింది. గురువారం నుంచి ఏ ర్యాంకు నుంచి ఏ ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ ని ర్వహించేది ప్రకటిస్తామని పేర్కొంది. కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయం ఏజెన్సీ, మైదానం నుంచి వచ్చిన టీచర్లు గంటల తరబడి పడిగాపులు కాశారు. తీరా బుధవారానికి కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో తిరిగి సొంతూళ్లకు వెళ్లడానికి రవాణా సదుపాయం లేక పోవడంతో నగరంలోనే బస చేయాల్సి వస్తోందని పలువురు టీచర్లు వాపోతున్నారు.

భవిష్యత్తు అవసరాల కోసమే మెట్రో రైలు

- రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి
- ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ శ్రీభరత్


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భవిష్యత్తు అవసరాల కోసం రూ.15 వేల కోట్ల వ్యయంతో మెట్రో రైలు ప్రా జెక్టును చేపడుతున్నామని, అలాగే భోగాపు రం విమానాశ్రయానికి వెళ్లడానికి వీలుగా రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం జరుగుతోందని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. హోటల్ గ్రాండ్ బే లో ఫ్యాప్సీ మంగళవారం నిర్వహించిన ఎక్స లెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన అతి థిగా హాజరై ప్రసంగించారు. మెట్రో రైలు ప్రా జెక్టు డీపీఆర్ దశలోనే ఉందని, డబుల్ డెక ర్ మోడల్‌లో నిర్మిస్తామన్నారు. ఆంధ్రప్ర దేశ్‌ను ఇతర రాష్ట్రాలకు దీటుగా పోటీగా నిల పాలంటే అందరి సలహాలు, సూచనలు అవ సరమన్నారు. విద్యా వ్యవస్థ-పారిశ్రామిక రం గం-ప్రభుత్వం మధ్య చాలా గ్యాప్(దూరం) ఉందని, ఒకరితో మరొకరు సమన్వయంతో ప ని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్యూరోక్ర సీ, కాలం చెల్లిన చట్టాల వల్ల సమస్యలు వస్తాయని, వాటిని సవరించుకుని ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. ప్రభుత్వానికి ఆదాయ రం గాల నుంచి సమాచారం అందిస్తే తగిన నిర్ణ యాలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భర త్‌తో కలిసి 11 మంది పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ ఎక్సలెన్స్-2025 అవార్డులను అందజే శారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్సీ రాష్ట్ర అధ్య క్షులు కంకటాల మల్లికార్జునరావు అధ్యక్షత వ హించి మాట్లాడుతూ, ఇకపై ఏటా ఈ అవా ర్డులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అవార్డ్స్ కన్వీనర్ కరుణేంద్ర, ఉపాధ్యక్షుడు ఎ. సత్యనారాయణ సంస్థ ప్రగతిని వివరించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన నాయకులు


లోకేశ్‌తో మాట్లాడుతున్న నారాయణరావు

భీమునిపట్నం/కొమ్మాది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరానికి వచ్చిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఉత్తరాంధ్ర వాడబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోడిపల్లి నారాయణరావు విశాఖ పార్టీ కార్యాల యంలో మంగళవారం మర్యాదపూర్వ కంగా కలి శారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

నేలకొరిగిన చెట్టుకొమ్మ



చెట్టు కొమ్మను తొలగింపజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

వెంకోజీపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :నగరంలో సోమవారం అర్ధరాత్రి వీచిన గాలులకు హెచ్‌బీ కాలనీలో చెట్టు కొమ్మ విరిగి నేలకొరిగింది. అయితే రాత్రి పూట కావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. చెట్టు కొమ్మ విరిగి నేలపై పడడంతో ఎవరికి ఎటువంటి ఆస్తి నష్టం కూడా సంభవించలేదు. అయితే విద్యుత్ సరఫరా కాస్త అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే స్పందించి వారు సత్వరమే చర్యలు తీసుకోవడంతో సరఫరా పునరుద్ధరించారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం మేస్త్రీ నమ్మి చిన్నరాజులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ట్రాఫిక్ సమస్య లేకుండా వెనువెంటనే చెట్టుకొమ్మను తొలగించినందుకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కంబాలకొండలో విరిగిన బెంచీ

» నాసిరకంగా పనులు చేపట్టడమే కారణమంటూ విమర్శలు



కంబాలకొండలో విరిగిన బెంచీ

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ పార్కులో సందర్శకులు కూర్చోడానికి క్యాంటీన్ పక్కన వేసిన బెంచీ విరిగిపోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన బెంచీల్లో ఇప్పటికే చాలా బెంచీలు విరిగిపోగా, తాజాగా మరో బెంచీ విరిగింది. నాసిరకంగా పనులు చేపట్టడం వల్లే ఇవి నాణ్యత లేకుండా పోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, కంబాలకొండలో చేపట్టిన పనులు నాణ్యత లేకపోవడంతో కుర్చీలు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. మరోవైపు ఈ విధంగా కంబాల కొండలో కుర్చీలు విరిగిపోతుండడం గమనార్హం. ఇలా నాసిరకంగా పనులు చేపట్టడం ఏమి టంటూ సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 24, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 44 దొండకాయలు 24, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 38 చిలగడదుంపలు 32, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలీ 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

వైభవంగా కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారిని పూజలు చేస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు దంపతులు

వెంకోజీపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోటలో శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం అంబరాన్నంటాయి. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, నగర మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం, అధ్యక్షులు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రరావు, సహాయ కార్యదర్శి ముగడ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఈగల రమణ, ఒమ్మి గోపినాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్, ప్రచార కార్యదర్శి ఉప్పిలి కృష్ణంనాయుడు ఇతర కమిటీ సభ్యులతో పాటు, టీడీపీ నాయకులు ముగడ వాసు, నారు గోపి తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలి శివాలయం సమీపంలో కుంగిన రహదారి

» యూజీడీ పైపులైన్ల వద్ద తరచూ ఇదే సమస్య



శివాలయం సమీపంలో కుంగిన రోడ్డు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి శివాలయం సమీపంలో యూజీడీ పైప్‌లైన్‌కు వేసిన పైపులైన్ వద్ద రోడ్డు కుంగిపోయింది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు ఇటీవల మాజీ మేయర్ హరి వెంకటకుమారి క్యాంపు కార్యాలయం సమీపంలో రెండు అడుగుల మేర రోడ్డు కుంగిపోయింది. అలా సుమారు 15 అడుగు వరకు లోపలకు వెళ్లింది. ప్రస్తుతం అక్కడ మరమ్మతులు చేపడుతున్నారు సుమారు పది రోజు నుంచి మరమ్మతులు సాగుతూనే ఉన్నాయి. అంతలోనే పెదగదిలి శివాలయం సమీపంలో ఇప్పుడు రోడ్డు కుంగింది. యూజీడీ పైపులైన్ కోసం గోతులు తవ్వడం, సరిగా పూడ్చకపోవడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల తాము ఇబ్బందులు పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఈ ప్రాంతలో కొత్తగా రోడ్డు వేయాలని కోరుతున్నారు.

నగర బీజేపీ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి వేడుకలు



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి, పరశురామ రాజు తదితరులు

పెదవాల్తేరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం బిర్సా ముండా 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి,బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశు రామ్‌రాజు విచ్చేసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పరశురామ్ రాజు మాట్లాడుతూ బిర్సా ముండా 1875-1900 గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడుగా అతను చోటా నాగ్పూర్ పీఠభూమి ప్రాంతంలోని ముండా తెగకు చెందినవాడుగా పుట్టి 1899-1900లో అతను బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన తిరుగుబాటును ప్రారంభించారన్నారు. ఈ తిరుగుబాటులోను ముండా తిరుగుబాటు లేదా ఉల్గులన్ అని పిలుస్తారని తెలిపారు. బిర్సా ముండాను భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. హక్కుల కోసం భూ దోపిడీపై ఆయన గిరిజన పక్షాన పోరాటం చేశారన్నారు. అతను బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాడారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం బిర్సా ముండాకు గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీ రంగం దనేష్, పొలిమెర శ్రీనివాస్, దామోదర్ యాదవ్, బీజేపీ నేతలు మూలా వెంకటరావు, గిరిజన మోర్చా నాయకులు శ్రీరాజా మురళీమోహన్ రాజు, రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ పణీంద్ర, మైనారిటీ మోర్చా నాయకులు ఆల్బర్ట్, మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కాండ్రేగుల రామకృష్ణ, శేషాలత, సౌమ్య, కోటేశ్వరరావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక హక్కులపై దాడి'

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సవరణ బిల్లు-2025 కార్మిక హక్కులు, వారి ఆత్మగౌరవంపై దాడిగా ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్ కృష్ణ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. పనిదినాన్ని పది గంటలకు పెంచుతూ రూపొందించిన ఈ బిల్లును రాష్ట్రమంత్రివర్గం ఆమోదించడం కార్మిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల చట్టాన్ని (1948) సవరిస్తూ, దీన్ని సంస్కరణగా ప్రభుత్వం ప్రచారం చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ఇలాంటి చట్టాలు తేవడం సరైంది కాదని అన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పని దినం ఆయువుపట్టు అని, కార్మికోద్యమాల ద్వారా దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న హక్కు అని, ఎనిమిది గంటల పనిదినాన్ని వ్యవస్థీకృతం చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు, విమ్స్ 11 కేవీ కైలాసగిరి ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నామని, ఈ నేపథ్యంలో విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను నరికే కార్యక్రమం చేపడతున్నట్టు ఆయన తెలిపారు. అందువల్ల తోటగరువు, బీఎస్‌ఆర్ నగర్, హనుమంతవాక కొండవాలు ప్రాంతం, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

కృష్ణా కళాశాలలో క్రికెట్ ఆడేండుకు అనుమతితో విద్యార్థుల ఇబ్బందులు

» ప్రైవేటు వ్యక్తులకు ఎలా అవకాశం ఇచ్చారంటూ విమర్శలు

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీ.ఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం క్రికెట్ టోర్నమెంట్‌కు అనుమతివ్వడంతో విద్యార్థులకు ఇబ్బందులకు గురయ్యారు. తరగతులు జరుగుతున్న సమయంలో ఈ మైదానంలో క్రీడలకు అనుమతి ఎలా ఇచ్చారంటూ పలువురు పలువురు ప్రశ్నిస్తున్నారు. గత నాలుగు రోజుల పాటు క్రికెట్ లీగ్ పేరుతో ఇక్కడ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం వరకూ ఆటలు నిర్వహించారు. ఈ పోటీలకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనుమతి ఇవ్వడంతో మద్దిలపాలెం ప్రాంత క్రికెట్ టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. దీంతో కళాశాల మైదానంలో నాలుగు రోజులు 20-20 మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే కళాశాలలు జరుగుతున్న సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బయట వ్యక్తులు వచ్చి కళాశాలలో ప్రాంగణంలో ఆటలు ఆడడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతున్న సమయంలో క్రికెట్ పోటీలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక నుంచి అయినా కళాశాల మైదానం బయట వ్యక్తుల క్రీడలకు అనుమతి ఇవ్వకూడదని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



మంగాపురం కాలనీలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో మంగళవారం టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ బాలకృష్ణ సినీరంగంలోనే కాకుండా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. దేశంలో మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, రాజ్‌కుమార్, డొక్కర శ్రీనివాస్, డి.రమణ, బి.రాజు, సత్యవతి, గణేష్, వాసు, జనసేన నాయకులు పోతు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు,హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పెదగదిలిలో విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ కార్యనిర్వాహణ కార్యదర్శి ఒమ్మి పోలారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కోశారు, ఈ సందర్భంగా జై బాలయ్య జైజై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర కేకు కట్‌చేసి, అభిమానులకు తినిపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ల శంకర్, ధనరెడ్డి, శివ, పోతనరెడి పాల్గొన్నారు.



కేకు కట్‌చేస్తున్న ప్రతాప్ వెలగపూడి

రీ షెడ్యూల్‌తో ఆలస్యంగా బయలుదేరిన పలు రైళ్లు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల రీత్యా పలు రైళ్లను మంగళవారం రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా బయలుదేరాయి. సాయంత్రం 5.45 గంటలకు విశాఖ నుంచి బయలుదేరాల్సిన విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532) రాత్రి 7.30 గంటలకు కదిలింది. సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరాల్సి విశాఖ-రాజమండ్రి మెమొ పాసింజర్ (67286) రాత్రి 8.20 గంటలకు కదిలింది. హౌరాలో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను(22887) రీ షెడ్యూల్ చేయడంతో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరింది. బ్రహ్మపూర్, రాజమండ్రి పాసింజర్ రైళ్ల రీ షెడ్యూల్ చేయడంతో ఇటు విజయనగరం, శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాలవారితోపాటు అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రోజువారీ విధులకు వెళ్లివచ్చేవారుఇబ్బంది పడ్డారు.

విద్యార్థులకు యోగాసనాల శిక్షణ



విద్యార్థినులతో యోగా సాధన చేయిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యోగాసనాల శిక్షణ ఇచ్చారు. ఈ నెల 21న నగరంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు ఆసనాలు వేసేందుకు ముందస్తు అవగాహన కల్పించారు. ఇందుకోసం యోగాలో శిక్షణ పొందిన ఉద్యోగులు కళాశాలకు చేరుకుని విద్యార్థులకు ఆసనాలు నేర్పించారు. సుమారు గంటన్నర సమయం విద్యార్థులతో వివిధ భంగిమలు, శ్వాస నియంత్రణ పద్ధతులను వివరించారు. యోగా ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు సన్యాసినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పటిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ఎంవీపీ కాలనీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ కార్మికుఢ మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలలా ఉన్నాయి.

ఎంవీపీ కాలనీలోని సీఎమ్మార్ కార్లాన్ అనే సంస్థలో మారికవలసకు చెందిన ఉప్పల సత్య జగన్నాథరావు(40) గ్రైండర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం పని చేస్తుండగా నేలపై నీరు ఉండడం వల్ల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అయితే కంపెనీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తన భర్త మృతి చెందినట్టు మృతుడి భార్య ఉప్పల సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తెలుగు మహిళల ఫిర్యాదు




ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా తరలి వెళుతున్న తెలుగు మహిళలు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని మహిళలపై సాక్షి చానల్ డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాస్, జర్నలిస్టు కృష్ణంరాజుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన పలువురు తెలుగు మహిళలు మంగళవారం సాయంత్రం ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరంతా పెదగదిలి నుంచి ర్యాలీగా బయలుదేరి పోలీసుస్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజధాని మహిళలు వేశ్యలు అంటూ పేర్కొనడం వారి దుర్బల బుద్ధికి నిదర్శనమన్నారు.వీరితో పాటు వీరి వెనుక ఉన్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతు పలుకుతున్న సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో 10 వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ 13వ తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, అధిక సంఖ్యలో మహిళలతో పాటు ఆయా వార్డులకు చెందిన టీడీపీ ఇన్‌చార్జిలు ఒమ్మి అప్పల రాజు, రాగతి అచ్యుతరావు, బుడమూరు గోవింద్, అధ్యక్ష, కారదర్శులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, ప్రసారం చేసిన సాక్షి టీవీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీలోని టీటీడి కల్యాణ మండపం నుంచి పోలీస్ స్టేషన్ వరకూ పాదయాత్రగా వెళ్లి, సీఐ మురళీకి ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటరు అప్పారి శ్రీవిద్య, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, టీడీపీ 16వ వార్డు ఇన్‌ఛార్జి పల్లా ఉమారాణి, మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారా శోభ ఆధ్వర్యంలో నాయకులు స్టేషన్‌కు వెళ్లారు. తెలుగుదేశం పార్టీ నాయకులు గొలగాని పోలరావు, బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరక్టర్ మల్ల రవి, నారా గోపి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

» పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు సన్మానం



రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్‌కు వన్‌టౌన్ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు అంతా కలిసి మంగళవారం రాత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌గా హెచ్ఐక్యూ షిప్పింగ్




విజేతలతో అతిథులు, నిర్వాహకులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో రెండు రోజులు జరిన ఈ టోర్నీలో ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్, లాల్‌వెన్నిమ్ టాటా, స్పార్నాస్, హెచ్ఐక్యూ షిప్పింగ్, సుందరనీడి షూటర్స్ విక్టరీ షిప్పింగ్ ఏజెన్సీ జట్లు పాల్గొన్నాయి. ప్రతి ఫ్రాంచైజ్ జట్టులో గ్రేడ్‌ల ఆధారంగా ఐదుగురు క్రీడాకారులు జట్టుగా ప్రాతినిధ్యం వహిం చి ప్రతిభను ప్రదర్శించారు. ఆసక్తికరంగా సాగిన ఈ టోర్నీలో 23 పాయింట్లతో హెచ్ఐక్యూ షిప్పింగ్ చాంపియన్ ట్రోఫీని కైవ సం చేసుకోగా, 22 పాయింట్లతో సుందరనీడి షూటర్స్ రన్నరప్‌గా నిలిచింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ మూడో స్థానం దక్కించుకుంది. మంగళవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఐఆర్‌టీఎస్ అధికారి హిమకర్ టాటా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.మాధవస్వామి, సురేంద్ర, కేవీ ఎస్ఎన్.రాజు ప్రత్యేక అతిథులుగా హాజరు కాగా, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి మురళి పాత్రుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్లతో అటవీ అధికారుల సమావేశం

» యోగాంధ్ర ప్రాంగణానికి పాములు రాకుండా పటిష్ఠ చర్యలు



స్నేక్ క్యాచర్లకు సూచనలిస్తున్న రేంజర్ పీవీ శాస్త్రి

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ బీచ్‌లో ఈ నెల 21న అంతర్జాయ యోగా దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఈ క్రమంలో యోగా దినోత్సవం నిర్వహించే ప్రాంతాలకు సర్పాలు, విష పురుగులు వంటివి రాకుండా చర్యలు తీసుకొంటున్నారు. ఇందుకోసం స్నేక్ క్యాచర్లను అందుబాటులో ఉంచనున్నారు. నగరంలో అధికంగా కొండ ప్రాంతాలు ఉండడంతో అకస్మాత్తుగా సర్పాలు దూసుకొచ్చే ప్రమాదం లేకపోలేదన్న విషయం గ్రహించిన అధికారులు, ఒకవేళ అలాంటి పరిస్థితే ఎదురైతే ఎదుర్కోవడానికి స్నేక్ క్యాచర్లను ఏర్పాటు చేస్తున్నారు. కంబాల కొండ అటవీశాఖ రేంజర్ పీవీ శాస్త్రి కంబాలకొండ పార్కులో గల క్యాంటిన్ వద్ద స్నేక్ క్యాచర్లతో మంగళవారం సమావేశమై తగిన సలహాలు, సూచనలు అందజేశారు. నగరంలోని 25 మంది స్నేక్ క్యాచర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ శాస్త్రి మాట్లాడుతూ కార్యక్రమంలో జరుగుతున్నంత సేపూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రుషికొండ నుంచి సాగర్ నగర్ గల కొండ ప్రాంతాలు, తోటల్లో స్నేక్ కూంబింగ్ నిర్వహించారు.

యోగా డే వేడుకల నిర్వహణపై మంత్రి లోకేశ్ సమీక్ష

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని అధికారులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సూచించారు. యోగా డే వేడుకలపై మంగళవారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ సాగరిక కన్వెన్షన్ హాల్‌లో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదో చారిత్రక కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ వర్షం పడితే ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, విప్‌లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారి

విశాఖలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎంటీ కృష్ణబాబు ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన 247 కంపార్టుమెంట్లలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు ఒక్కొక్క గెజిటెడ్ అధికారికి బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా వారిని నిర్ణీత కంపార్ట్‌మెంట్లలోకి అనుమతిస్తామన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం రెండు వేల మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లకు ఎంపిక చేశామని, వారందరినీ ముందురోజు రాత్రే ఏయూ గ్రౌండ్స్‌కు రప్పిస్తామన్నారు. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్‌లు సిద్ధం చేశామని, హాజరయ్యే వారందరికీ మ్యాట్స్, టీషర్ట్ ఆయా కంపార్ట్‌మెంట్ వద్ద అందించనున్నట్టు తెలిపారు. 1400 బయో టాయ్‌లెట్లను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచే వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, ఎనిమిది వేల ప్రైవేటు, స్కూలు బస్సులు సిద్ధం చేసినట్టు తెలిపారు.

భవిష్యత్తు అవసరాల కోసమే మెట్రో రైలు

- రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి
- ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ శ్రీభరత్


ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భవిష్యత్తు అవసరాల కోసం రూ.15 వేల కోట్ల వ్యయంతో మెట్రో రైలు ప్రాజెక్టును చేపడుతున్నామని, అలాగే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి వీలుగా రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం జరుగుతోందని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. హోటల్ గ్రాండ్ బేలో ఫ్యాప్సీ మంగళవారం నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు. మెట్రో రైలు ప్రాజెక్టు డీపీఆర్ దశలోనే ఉందని, డబుల్ డెక్కర్ మోడల్‌లో నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు దీటుగా పోటీగా నిలపాలంటే అందరి సలహాలు, సూచనలు అవసరమన్నారు. విద్యా వ్యవస్థ-పారిశ్రామిక రంగం-ప్రభుత్వం మధ్య చాలా గ్యాప్(దూరం) ఉందని, ఒకరితో మరొకరు సమన్వయంతో పనిచేయాల్సి అవసరం ఉందన్నారు. బ్యూరోక్రసీ, కాలం చెల్లిన చట్టాల వల్ల సమస్యలు వస్తాయని, వాటిని సవరించుకొని ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. ప్రభుత్వానికి ఆయా రంగాల నుంచి సమాచారం అందిస్తే తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్‌తో కలిసి 11 మంది పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ ఎక్సలెన్స్-2025 అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఇకపై ఏటా ఈ అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అవార్డ్స్ కన్వీనర్ కరుణేంద్ర, ఉపాధ్యకులు ఎ.సత్యనారాయణ సంస్థ ప్రగతిని వివరించారు.

ఫీజులు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

సీతంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులను, పుస్తకాలు, యూనిఫాం వ్యాపారాన్ని అరికట్టాలని నినాదాలు చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సీతంపేట ప్రధాన రహదారిలోని శ్రీవిశ్వ ప్రధాన కళాశాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పరిష్కరించాలని ఒత్తిడి తెచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.అజయ్ మాట్లాడుతూ జిల్లాలో నారాయణ, చైతన్య, శ్రీవిశ్వ, అన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్ మీడియట్ బోర్డు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా వేలాది రూపాయలకు పుస్తకాలు, యూనిఫాం, తదితర వస్తువులను అక్రమంగా విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ఒక్కొక్క విద్యార్థికి అదనంగా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు తల్లిదండ్రుల వద్ద దోచుకుంటున్నాయన్నారు. వీరి దోపిడీని అడ్డుకుంటామని అన్నారు. విద్యాశాఖ మంత్రి స్పందించి తల్లిదండ్రులకు భారం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు, ఉపాధ్యక్షుడు డి.వెంకటరమణ, ప్రతినిధులు కౌశిక్, శశికుమార్, కుసుమంజలి, మౌనిక, ప్రగతి, కావ్య, గుణ, వినయ్, నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 (అనకాపల్లి) కమిషనర్‌గా కె.చక్రవర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై జీవీఎంసీలో పోస్టింగ్ ఇచ్చింది. అలాగే విజయనగరం కో-ఆపరేటివ్ శాఖలో ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న బి.సన్యాసినాయుడును డిప్యూటేషన్‌పై జీవీఎంసీ డీపీఓగా నియమించింది. ప్రస్తుతం డీపీఓగా పనిచేస్తున్న డి.లక్ష్మి వచ్చే నెల 31న ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఆమె స్థానంలో చేరాలని సూచించింది. వెయిటింగ్‌లో ఉన్న గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లు టి.టి.రత్నకుమార్, పీపీ ప్రసన్నవాణికి జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్లుగా పోస్టింగ్ ఇచ్చింది.

సూపర్ బజారు ఎండీగా శ్రీరామమూర్తి



విశాఖపట్నం సూపర్ బజారు మేనేజింగ్ డైరెక్టర్‌గా పి.శ్రీరామమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సహకార శాఖాధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ ఎండీగా నియమించారు.

నేడు ఏరువాక పౌర్ణమి వేడుకలు

మురళీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.ప్రసాద్ తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, నిజపాద దర్శనం, అష్టోత్తర కలశాభిషేకం, పుష్పాంజలి సేవలు జరుగుతాయన్నారు. పుష్పాంజలి సేవ కోసం భక్తులు వివిధ రకాల పుష్పాల్ని మందిరానికి తీసుకురావచ్చని అన్నారు.

లోకేశ్ ప్రజా దర్బార్

(5వ పేజీ తరువాయి)

దిగారు. పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇంకా దాడి వీరభద్రరావు, బుద్దా నాగజగదీష్, దాడి రత్నాకర్, మహ్మద్ నజీర్, పీవీజీ కుమార్, నాయకులు కలిశారు.

పల్లా కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ పరామర్శ

(5వ పేజీ తరువాయి)

సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. పల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సింహాచలం మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

(5వ పేజీ తరువాయి)

శాఖ ప్రకటించింది. అయితే బుధవారం ఒకటో నంబరు నుంచి 300 వరకూ మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపింది. గురువారం నుంచి ఏ ర్యాంకు నుంచి ఏ ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహించేదీ ప్రకటిస్తామని పేర్కొంది. కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయం ఏజెన్సీ, మైదానం నుంచి వచ్చిన టీచర్లు గంటల తరబడి పడిగాపులు కాశారు. తీరా బుధవారానికి కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో తిరిగి సొంతూళ్లకు వెళ్లడానికి రవాణా సదుపాయం లేకపోవడంతో నగరంలోనే బస చేయాల్సి వస్తోందని పలువురు టీచర్లు వాపోతున్నారు.

నేటి నుంచి నీటి సరఫరా విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

(5వ పేజీ తరువాయి)

బుధవారం నుంచి సమ్మెకు దిగుతామని పేర్కొంటూ జీవీఎంసీ కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆనందరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.01 గంటలకు కార్మికులంతా టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ప్రధాన పంప్‌హౌస్ వద్దకు చేరుకోవాలని వాటర్‌సప్లై కార్మికులకు పిలుపునిచ్చారు. మరోవైపు సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి సైతం నీటి సరఫరా విభాగంలో స్కిల్డ్ విధులు నిర్వర్తిస్తున్నవారికి జీతాలు పెంపుదల అమలుచేయాల్సిందేనని, లేనిపక్షంలో తాము కూడా సమ్మెకు దిగుతామని పేర్కొంటూ అధికారులకు నోటీసు అందజేశారు. దీంతో బుధవారం నుంచి నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలగడం ఖాయమని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



56వ వార్డులో కేకు కోస్తున్న టీడీపీ నాయకులు

కంచరపాలెం/అక్కయ్యపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు జీవీఎంసీ 56వ వార్డులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెడ్డికంచరపాలెం ఆర్చ్ సమీపంలోని పార్టీ కార్యాలయం ఇందుకు వేదిక అయ్యింది. సీనియర్ నాయకుడు బింగిరాజు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాత 36వ వార్డు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కేకు కోసి తమ అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమానులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు జోగా మహేష్, యలమంచిలి కనకేశ్, బండారు అప్పలరాజు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పూజారి శివ, సంపత్, బాబూరావు, వైవీవీ అదినారాయణ, మహిళా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో 55వ వార్డు యెల్లబిల్లివీధిలో వేడుకలు జరిగాయి. ఆమె కేకు కోసి మహిళలకు పండ్లు, చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఉత్తర నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు తోట శ్రీదేవి, పార్లమెంట్ తెలుగు మహిళ డి.లక్ష్మీలావణ్య, వార్డు నాయకులు ఈశ్వరరావు, బాబూరావు, వీరుబాబు, వెంకటరమణ, అప్పారావు, తెలుగు మహిళలు ఎం.లక్ష్మి, పి.చింతలమ్మ, పి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ లోకోమోటివ్ అప్‌గ్రేడ్ పోటీల్లో విశాఖకు ద్వితీయ స్థానం


ట్రోఫీతో డీఆర్ఎం, ఏడీఆర్ఎంలు, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ లోకోమోటివ్ అప్‌గ్రేడ్ బ్యూటీ కాంటెస్టులో విశాఖలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్ వైడ్ బ్రాడ్ గేజ్ ఏసీ ఎలక్ట్రిక్ పాసింజర్, క్లాసు-7 (డబ్లుఏపీ7) సిబ్బంది ద్వితీయ స్థానం సాధించారు. బనారస్ లోకోమోటివ్ వర్క్సులో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా భారతీయ రైల్వేకు చెందిన వివిధ జోన్‌ల నుంచి 13 లోకోమోటివ్‌లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో పాల్గొన్న విశాఖ ఎలక్ట్రికల్ లోకోషెడ్ సిబ్బంది, డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ షణ్ముఖరావు మార్గదర్శకాల మేరకు రైల్వే బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో డబ్లుఏపీ7 లోకోమోటివ్ 37419లో అప్‌గ్రేడ్‌లో భాగంగా వినూత్న మార్పులు చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ సిబ్బంది విధుల నిర్వహణలో చూపుతున్న నిబద్ధత, నైపుణ్యాన్ని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, శాంతరామ్, అధికారులు అభినందించారు.

రెవెన్యూలో బదిలీలు

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగుల్లో వినిపిస్తోంది. పలు కారణాలతో కొందరు బదిలీల నుంచి తప్పించుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పెందుర్తి తహశీల్దారుగా నియమితులైన అల్లూరి జిల్లా జీకే వీధి తహశాల్దార్ టి.రామకృష్ణపై పలు ఆరోపణలు ఉన్నాయని, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రాజాం, వంగర, కొత్తూరు మండలాల్లో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడడంతో ఆయన సస్పెండ్ అయ్యారని అంటున్నారు. అటువంటి అధికారిని పెందుర్తి తహశీల్దారుగా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ట్రెజరీ బదిలీల్లో ఒంటెత్తు పోకడలు

జిల్లా ఖజానా కార్యాలయంలో ఐదారు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. బదిలీల కోసం ఏర్పాటైన కమిటీ సోమవారం రాత్రి చర్చించి ఉత్తర్వులను స్వల్పంగా సవరించింది. మొత్తం 34 మందిలో ఐదుగురి వ్యవహారంలో పొరపాట్లు సవరించామని ఇన్‌చార్జి డీటీవో గోవిందరావు తెలిపారు. అయితే కార్యాలయంలో భారీగా మామూళ్లు వసూలుచేసే ఉద్యోగిని వెనుకేసుకు వచ్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా అవుట్ సోర్సింగ్ కింద పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్ల బదిలీలు వివాదాస్పదమయ్యాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నెలకు రూ.16 వేలు, అటెండర్లకు రూ.12 వేలు ఇస్తున్నారు. అంత తక్కువ వేతనంతో పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఎలా బతుకుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇన్‌చార్జి డీటీవో గోవిందరావు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఆపరేటర్లు, అటెండర్ల పోస్టులు పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఉన్నాయని, అందుకే వారిని అక్కడకు పంపామన్నారు. అయితే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న విశాఖకు వారం, పది రోజుల తరువాత తీసుకువస్తామన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి

డాబాగార్డెన్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు పి. రమణికుమారి అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హరివెంకటకుమారి, కార్పొరేటర్లు, మహిళా విభాగం అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చియమ్మపేటలో అన్నదానం

అల్లిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అచ్చియమ్మపేట అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంచపు ఆదినారాయణ తెలిపారు. కాగా ఉదయం స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన, సాయంత్రం దీపారాధన చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గీతం కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు

సాగర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్ ర్యాంకింగ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. రాజా ప్రభు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గీతం వర్సిటీకి ఎన్‌బీఏ గుర్తింపు లభించడం అంత ర్జాతీయంగా వర్సిటీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. దేశంలో అతికొద్ది వర్సిటీలకు మాత్రమే ఎన్‌బీఏ గుర్తింపు ఉందన్నారు. కోర్సుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల్లో నైపుణ్యాలతో పాటు పలు అంశాల పరిశీలన అనంతరం ఎన్‌బీఏ నిపుణుల కమిటీ ఈ గుర్తింపును ప్రకటించిందన్నారు.

ముగిసిన కిశోర వికాస శిబిరం


శిబిరంలో పాల్గొన్న బాలికలు

మర్రిపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు కౌమరదశపై అవగాహనతో ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెఎస్‌టీ జ్యోతి అన్నారు. మంగళవారం మర్రిపాలెం నరేంద్రనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర వికాస వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలికలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కౌమార బాలికలను సాధికారపరచడం, వారు తమ కాళ్లపై తాము నిలబడగలిగేలా ప్రేరేపించడం, రక్తహీనత సమస్యను అధిగమించేలా చేసి చదువులు, వృత్తిలో సహాయం చేయడం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం తదితర అంశాల్లో అవగాహన కల్పించామన్నారు. కిశోర కమిటీ కన్వీనర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ఏకాహం

మాధవధార, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జులై 10న గురుపౌర్ణమి వేడుకలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ మురళీనగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఏకాహం జరిపారు. సాయంత్రం అఖండ జ్యోతి వెలిగించారు. నిర్విరామంగా 12 గంటల పాటు సాయి నామస్మరణతో భక్తులు భజన చేశారు. అతిథిగా విచ్చేసిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

సాక్షి మీడియాను నిషేధించాలి

తెలుగు మహిళల భారీ ర్యాలీ



ఆందోళనలో పాల్గొన్న తెలుగు మహిళలు

మహారాణిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలకు వేదికగా నిలిచిన సాక్షి మీడియాను నిషేధించాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ డిబేట్ పేరుతో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజు మహిళల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రాజధాని అమరావతిపై అక్కసుతోనే సాక్షి మీడియా కుట్రకు తెర తీసిందని ఆరోపించారు. కుట్ర వెనుక మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతీరెడ్డి ఉన్నారని చెప్పారు. మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, నాయకులు అనంత లక్ష్మి, గనగళ్ళ సత్య విజయకుమార్, హారతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి వేడుకలు


పూజ అనంతరం ఎమ్మెల్యే వంశీకి జ్ఞాపికను అందిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలతో మొక్కుబడులు చెల్లించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ఈ ఏడాది ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు లేకుండా, అంతా వేటకు వెళ్లి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మర పడవల సంఘం అధ్యక్షుడు ఎం. లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు పీసీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి ముస్నం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐటీఐ కౌన్సెలింగ్


ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఐటీఐ ప్రవేశాల ప్రక్రియ (కౌన్సెలింగ్) మంగళవారం ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో సుమారు వెయ్యి వరకు సీట్లు కేటాయించినట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు కేటాయింపు పత్రంతో ఐటీఐల విభాగాలకు రిపోర్టు చేయాలని సూచించారు. ప్రధానమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్, కోపా తదితర ట్రేడుల్లో ప్రవేశాలను కల్పించా మన్నారు. ప్రతిభ ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా కనకమాంబ మహోత్సవం


ఊరేగింపులో తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

సీతంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కనకమ్మవారి వీధిలో గల త్రిశక్తి మూడుగుళ్ల అమ్మవారి ఆలయంలో గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. చుట్టుపక్కల వీధుల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం, చుట్టు పక్కల వీధుల్లో విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హిందీ డ్రామా పోటీల్లో వాల్తేరు డివిజన్‌కు కాంస్యం

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత హిందీ డ్రామా పోటీల్లో వాల్తేరు డివిజన్‌కు కాంస్య పతకం దక్కింది. భుసావల్‌లో జరిగిన ఈ పోటీల్లో భారతీయ రైల్వేకు చెందిన సాంస్కృతిక విభాగాల జట్లు పాల్గొన్నాయి. తూర్పుకోస్తా రైల్వే నుంచి ప్రాతినిధ్యం వహించిన వాల్తేరు డివిజన్ విభాగం కళాకారుల బృందం 'ఆఖెయిన్' అనే నాటకాన్ని ప్రదర్శించింది. వీరి స్కిట్ న్యాయనిర్ణేతలు, ఆహూతులను ఆకట్టుకుని మూడో స్థానంలో నిలిచింది. సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా నుంచి ట్రోఫీని అందుకున్న నాటక బృందాన్ని జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బొహ్రా అభినందించారు.

అక్రమార్కులకు మహా దన్ను!

(5వ పేజీ తరువాయి)

అనేదానితోపాటు ఖాళీస్థలమైతే వీఎల్‌టీ, అదే పాత ఇల్లు కూలగొట్టి కొత్తగా నిర్మిస్తే ఇంటి పన్ను పూర్తిగా చెల్లించారా?, లేదా?..అనేది తనిఖీ చేస్తారు. అదే వ్యవసాయ యోగ్యమైన భూమిలో నిర్మాణానికి ప్లాన్ పెడితే మాత్రం భూ వినియోగ మార్పిడి (నాలా) ఫీజు రెవెన్యూ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. నాలా ఫీజు కట్టిన రశీదుతోపాటు వీఎల్‌టీ కింద జీవీఎంసీకి చెల్లించిన ఫీజు రశీదులను దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అలా అయితేనే ప్లాన్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని, నిర్మాణానికి అనుమతిస్తారు. అలాకాకుండా నాలా ఫీజు రశీదు లేకపోతే మాత్రం ప్లాన్ దరఖాస్తును వెనక్కి పంపించేయాలి. ఒకవేళ భవన నిర్మాణదారుడు తాను నాలా ఫీజు తర్వాత చెల్లించి రశీదుని అప్‌లోడ్ చేస్తానని హామీ పత్రం అందజేస్తే మాత్రం అదే షరతును నోట్‌ఫైల్‌లో రాసి ప్లాన్‌ను అనుమతిస్తారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపేషన్ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసేలోపు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఓసీ జారీచేయరు. ఓసీ లేకపోతే ఇంటి పన్ను రెట్టింపు విధించడంతోపాటు జీవీఎంసీకి మార్టిగేజ్ చేసిన ఫ్లాట్‌లను రిలీజ్ చేయరు. అయితే కొంతమంది భవన నిర్మాణదారులు, బడా బిల్డర్లు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులను ప్రసన్నం చేసుకుని నాలా ఫీజు చెల్లించకుండా మేనేజ్ చేసేస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత నాలా ఫీజు చెల్లింపు ప్రస్తావన లేకుండానే ఓసీని తెచ్చుకుంటున్నారు.

కూర్మన్నపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎంవీవీ, ఎంకే పేరుతో 9.57 ఎకరాల్లో రెండు వేల ఫ్లాట్‌లు కలిగిన గేటెడ్ కమ్యూనిటీ నిర్మించారు. దీనికి 2019లో ప్లాన్ కోసం దరఖాస్తు చేయగా, నాలా ఫీజు కింద ఏడు ఎకరాలకు రూ.7.59 కోట్లు చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు నోట్ షీట్‌లో రాశారు. తర్వాత నాలా ఫీజును చెల్లిస్తానని బిల్డర్ నుంచి హామీ పత్రం తీసుకుని ప్లాన్ రిలీజ్ చేశారు. 2024లో భవన నిర్మాణం పూర్తయ్యింది. అయితే నాలా ఫీజు కట్టకపోయినాసరే బిల్డర్ ఆక్యుపేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయగానే అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే జారీచేసేశారు. దీనిపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌తోపాటు మరికొందరు ఫిర్యాదు చేయడంతో నాలా ఫీజు కింద రూ.7.59 కోట్లు చెల్లించాలని నోటీసు జారీచేశారు. అయినా ఇంతవరకు నోటీసుని పట్టించుకున్న దాఖల్లాలేవు. పైగా శ్మశాన స్థలాన్ని, ఏలేరు కాలువ బఫర్‌జోన్‌గా మార్కుచేసిన స్థలాన్ని కబ్జా చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా గేటెడ్ కమ్యూనిటీ లోపల అంతర్గత రహదారి కోసం 2,187 గజాల స్థలం విడిచిపెట్టేసినందున పరిహారంగా నాలుగు రెట్లు సెట్ బ్యాక్ ఉల్లంఘనకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అంగీకారం తెలిపారు. ఇదే విషయమై నాలుగు రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. దీనికి మేయర్ పీలా శ్రీనివాసరావు స్పందిస్తూ ఎంవీవీ, ఎంకే పార్క్ గేటెడ్ కమ్యూనిటీ ఉల్లంఘనలపై సమాధానం ఇవ్వాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించగా, నాలా ఫీజు కింద రూ.7.9 కోట్లు బకాయి ఉండగానే ఓసీ జారీచేసిన విషయం వాస్తవమేనని వెల్లడించారు. ఇందుకు కారకులెవరనే దానిపై సమగ్రవిచారణ జరిపి వారంరోజుల్లోగా తనకు నివేదిక అందజేయాలని సీసీపీని మేయర్ ఆదేశించారు.

నేలకొరిగిన చెట్టుకొమ్మ



చెట్టు కొమ్మను తొలగింపజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

వెంకోజీపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :నగరంలో సోమవారం అర్ధరాత్రి వీచిన గాలులకు హెచ్‌బీ కాలనీలో చెట్టు కొమ్మ విరిగి నేలకొరిగింది. అయితే రాత్రి పూట కావడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. చెట్టు కొమ్మ విరిగి నేలపై పడడంతో ఎవరికి ఎటువంటి ఆస్తి నష్టం కూడా సంభవించలేదు. అయితే విద్యుత్ సరఫరా కాస్త అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే స్పందించి వారు సత్వరమే చర్యలు తీసుకోవడంతో సరఫరా పునరుద్ధరించారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ట్రాఫిక్ సమస్య లేకుండా వెనువెంటనే చెట్టుకొమ్మను తొలగించినందుకు జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కంబాలకొండలో విరిగిన బెంచీ

» నాసిరకంగా పనులు చేపట్టడమే కారణమంటూ విమర్శలు



కంబాలకొండలో విరిగిన బెంచీ

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ పార్కులో సందర్శకులు కూర్చోడానికి క్యాంటీన్ పక్కన వేసిన బెంచీ విరిగిపోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన బెంచీల్లో ఇప్పటికే చాలా బెంచీలు విరిగిపోగా, తాజాగా మరో బెంచీ విరిగింది. నాసిరకంగా పనులు చేపట్టడం వల్లే ఇవి నాణ్యత లేకుండా పోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, కంబాలకొండలో చేపట్టిన పనులు నాణ్యత లేకపోవడంతో కుర్చీలు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. మరోవైపు ఈ విధంగా కంబాలకొండలో కుర్చీలు విరిగిపోతుండడం గమనార్హం. ఇలా నాసిరకంగా పనులు చేపట్టడం ఏమి టంటూ సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 24, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 44 దొండకాయలు 24, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 38 చిలగడదుంపలు 32, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలీ 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

వైభవంగా కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారిని పూజలు చేస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు దంపతులు

వెంకోజీపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోటలో శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం అధ్వర్యంలో నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం అంబరాన్నంటాయి. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, నగర మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం, అధ్యక్షులు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రరావు, సహాయ కార్యదర్శి ముగడ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఈగల రమణ, ఒమ్మి గోపినాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్, ప్రచార కార్యదర్శి ఉప్పిలి కృష్ణంనాయుడు ఇతర కమిటీ సభ్యులతో పాటు, టీడీపీ నాయకులు ముగడ వాసు, నారు గోపి తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలి శివాలయం సమీపంలో కుంగిన రహదారి

» యూజీడీ పైపులైన్ల వద్ద తరచూ ఇదే సమస్య



శివాలయం సమీపంలో కుంగిన రోడ్డు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి శివాలయం సమీపంలో యూజీడీ పైప్‌లైన్‌కు వేసిన పైపులైన్ వద్ద రోడ్డు కుంగిపోయింది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు ఇటీవల మాజీ మేయర్ హరి వెంకటకుమారి క్యాంపు కార్యాలయం సమీపంలో రెండు అడుగుల మేర రోడ్డు కుంగిపోయింది. అలా సుమారు 15 అడుగు వరకు లోపలకు వెళ్లింది. ప్రస్తుతం అక్కడ మరమ్మతులు చేపడుతున్నారు సుమారు పది రోజు నుంచి మరమ్మతులు సాగుతూనే ఉన్నాయి. అంతలోనే పెదగదిలి శివాలయం సమీపంలో ఇప్పుడు రోడ్డు కుంగింది. యూజీడీ పైపులైన్ కోసం గోతులు తవ్వడం, సరిగా పూడ్చకపోవడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల తాము ఇబ్బందులు పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఈ ప్రాంతలో కొత్తగా రోడ్డు వేయాలని కోరుతున్నారు.

'కార్మిక హక్కులపై దాడి'

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సవరణ బిల్లు-2025 కార్మిక హక్కులు, వారి ఆత్మగౌరవంపై దాడిగా ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్ కృష్ణ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. పనిదినాన్ని పది గంటలకు పెంచుతూ రూపొందించిన ఈ బిల్లును రాష్ట్రమంత్రివర్గం ఆమోదించడం కార్మిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల చట్టాన్ని (1948) సవరిస్తూ, దీన్ని సంస్కరణగా ప్రభుత్వం ప్రచారం చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ఇలాంటి చట్టాలు తేవడం సరైంది కాదని అన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పనిదినం ఆయువుపట్టు అని, కార్మికోద్యమాల ద్వారా దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న హక్కు అని, ఎనిమిది గంటల పనిదినాన్ని వ్యవస్థీకృతం చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు, విమ్స్ 11 కేవీ కైలాసగిరి ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నామని, ఈ నేపథ్యంలో విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను నరికే కార్యక్రమం చేపడతున్నట్టు ఆయన తెలిపారు. అందువల్ల తోటగరువు, బీఎస్‌ఆర్ నగర్, హనుమంతవాక కొండవాలు ప్రాంతం, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

కృష్ణా కళాశాలలో క్రికెట్ ఆడేందుకు అనుమతితో విద్యార్థుల ఇబ్బందులు

» ప్రైవేటు వ్యక్తులకు ఎలా అవకాశం ఇచ్చారంటూ విమర్శలు

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీ.ఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం క్రికెట్ టోర్నమెంట్‌కు అనుమతివ్వడంతో విద్యార్థులకు ఇబ్బందులకు గురయ్యారు. తరగతులు జరుగుతున్న సమయంలో ఈ మైదానంలో క్రీడలకు అనుమతి ఎలా ఇచ్చారంటూ పలువురు పలువురు ప్రశ్నిస్తున్నారు. గత నాలుగు రోజుల పాటు క్రికెట్ లీగ్ పేరుతో ఇక్కడ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం వరకూ ఆటలు నిర్వహించారు. ఈ పోటీలకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనుమతి ఇవ్వడంతో మద్దిలపాలెం ప్రాంత క్రికెట్ టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. దీంతో కళాశాల మైదానంలో నాలుగు రోజులు 20-20 మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే కళాశాలలు జరుగుతున్న సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బయట వ్యక్తులు వచ్చి కళాశాలలో ప్రాంగణంలో ఆటలు ఆడడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతున్న సమయంలో క్రికెట్ పోటీలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక నుంచి అయినా కళాశాల మైదానం బయట వ్యక్తుల క్రీడలకు అనుమతి ఇవ్వకూడదని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



మంగాపురం కాలనీలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో మంగళవారం టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ బాలకృష్ణ సినీరంగంలోనే కాకుండా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. దేశంలో మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం గౌరవించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, రాజ్‌కుమార్, డొక్కర శ్రీనివాస్, డి.రమణ, బి.రాజు, సత్యవతి, గణేష్, వాసు, జనసేన నాయకులు పోతు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు,హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పెదగదిలిలో విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ కార్యనిర్వాహణ కార్యదర్శి ఒమ్మి పోలారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కోశారు, ఈ సందర్భంగా జై బాలయ్య జైజై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర కేకు కట్‌చేసి, అభిమానులకు తినిపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కాళ్ల శంకర్, ధనరెడ్డి, శివ, పోతనరెడి పాల్గొన్నారు.



కేకు కట్‌చేస్తున్న ప్రతాప్ వెలగపూడి

రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తెలుగు మహిళల ఫిర్యాదు



ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా తరలి వెళుతున్న తెలుగు మహిళలు

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని మహిళలపై సాక్షి చానల్ డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాస్, జర్నలిస్టు కృష్ణంరాజుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన పలువురు తెలుగు మహిళలు మంగళవారం సాయంత్రం ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరంతా పెదగదిలి నుంచి ర్యాలీగా బయలుదేరి పోలీసుస్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజధాని మహిళలు వేశ్యలు అంటూ పేర్కొనడం వారి దుర్బల బుద్ధికి నిదర్శనమన్నారు.వీరితో పాటు వీరి వెనుక ఉన్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతు పలుకుతున్న సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో 10 వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ 13వ తెలుగు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, అధిక సంఖ్యలో మహిళలతో పాటు ఆయా వార్డులకు చెందిన టీడపీ ఇన్‌చార్జిలు ఒమ్మి అప్పల రాజు, రాగతి అచ్యుతరావు, బుడమూరు గోవింద్, అధ్యక్ష, కారదర్శులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : మహిళలపై అనుచిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, ప్రసారం చేసిన సాక్షి టీవీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీలోని టీటీడి కల్యాణ మండపం నుంచి పోలీస్ స్టేషన్ వరకూ పాదయాత్రగా వెళ్లి, సీఐ మురళీకి ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటరు అప్పారి శ్రీవిద్య, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, టీడీపీ 16వ వార్డు ఇన్‌చార్జి పల్లా ఉమారాణి, మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారా శోభ ఆధ్వర్యంలో నాయకులు స్టేషన్‌కు వెళ్లారు. తెలుగుదేశం పార్టీ నాయకులు గొలగాని పోలరావు, బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరక్టర్ మల్ల రవి, నారా గోపి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

» **పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు సన్మానం**



రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్‌కు వన్‌టౌన్ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు అంతా కలిసి మంగళవారం రాత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌గా హెచ్‌ఐక్యూ షిప్పింగ్




విజేతలతో అతిథులు, నిర్వాహకులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో రెండు రోజులు జరిన ఈ టోర్నీలో ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్, లాల్‌వెన్షిమ్ టాటా, స్పార్టాన్స్, హెచ్‌ఐక్యూ షిప్పింగ్, సుందరనీడి షూటర్స్ విక్టరీ షిప్పింగ్ ఏజెన్సీ జట్లు పాల్గొన్నాయి. ప్రతి ఫ్రాంచైజ్ జట్టులో గ్రేడ్‌ల ఆధారంగా ఐదుగురు క్రీడాకారులు జట్టుగా ప్రాతినిధ్యం వహిం చి ప్రతిభను ప్రదర్శించారు. ఆసక్తికరంగా సాగిన ఈ టోర్నీలో 23 పాయింట్లతో హెచ్‌ఐక్యూ షిప్పింగ్ చాంపియన్ ట్రోఫీని కైవ సం చేసుకోగా, 22 పాయింట్లతో సుందరనీడి షూటర్స్ రన్నరప్‌గా నిలిచింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ మూడో స్థానం దక్కించుకుంది. మంగళవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఐఆర్‌టీఎస్ అధికారి హిమకర్ టాటా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.మాధవస్వామి, సురేంద్ర, కేవీ ఎస్ఎన్.రాజు ప్రత్యేక అతిథులుగా హాజరు కాగా, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి మురళి పాత్రుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్లతో అటవీ అధికారుల సమావేశం

» యోగాంధ్ర ప్రాంగణానికి పాములు రాకుండా పటిష్ఠ చర్యలు



స్నేక్ క్యాచర్లకు సూచనలిస్తున్న రేంజర్ పీవీ శాస్త్రి

ఆరిలోవ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖ బీచ్‌లో ఈ నెల 21న అంతర్జాయ యోగా దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. ఈ క్రమంలో యోగా దినోత్సవం నిర్వహించే ప్రాంతాలకు సర్పాలు, విష పురుగులు వంటివి రాకుండా చర్యలు తీసుకొంటున్నారు. ఇందుకోసం స్నేక్ క్యాచర్లను అందుబాటులో ఉంచనున్నారు. నగరంలో అధికంగా కొండ ప్రాంతాలు ఉండడంతో అకస్మాత్తుగా సర్పాలు దూసుకొచ్చే ప్రమాదం లేకపోలేదన్న విషయం గ్రహించిన అధికారులు, ఒకవేళ అలాంటి పరిస్థితే ఎదురైతే ఎదుర్కోవడానికి స్నేక్ క్యాచర్లను ఏర్పాటు చేస్తున్నారు. కంబాల కొండ అటవీశాఖ రేంజర్ పీవీ శాస్త్రి కంబాలకొండ పార్కులో గల క్యాంటిన్ వద్ద స్నేక్ క్యాచర్లతో మంగళవారం సమావేశమై తగిన సలహాలు, సూచనలు అందజేశారు. నగరంలోని 25 మంది స్నేక్ క్యాచర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ శాస్త్రి మాట్లాడుతూ కార్యక్రమంలో జరుగుతున్నంత సేపూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రుషికొండ నుంచి సాగర్ నగర్ గల కొండ ప్రాంతాలు, తోటల్లో స్నేక్ కూంబింగ్ నిర్వహించారు.

నగర బీజేపీ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి వేడుకలు



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి, పరశురామ రాజు తదితరులు

పెదవాల్తేరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం బిర్సా ముండా 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి,బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశు రామ్‌రాజు విచ్చేసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పరశురామ్ రాజు మాట్లాడుతూ బిర్సా ముండా 1875-1900 గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడుగా అతను చోటా నాగ్పూర్ పీఠభూమి ప్రాంతంలోని ముండా తెగకు చెందినవాడుగా పుట్టి 1899-1900లో అతను బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజన తిరుగుబాటును ప్రారంభించారన్నారు. ఈ తిరుగుబాటులోను ముండా తిరుగుబాటు లేదా ఉల్గులన్ అని పిలుస్తారని తెలిపారు. బిర్సా ముండాను భాతర స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. హక్కుల కోసం భూ దోపిడీపై ఆయన గిరిజన పక్షాన పోరాటం చేశారన్నారు. అతను బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాడారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం బిర్సా ముండాకు గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీ రంగం దనేష్, పొలిమెర శ్రీనివాస్, దామోదర్ యాదవ్, బీజేపీ నేతలు మూలా వెంకటరావు, గిరిజన మోర్చా నాయకులు శ్రీరాజా మురళీమోహన్ రాజు, రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ పణీంద్ర, మైనారిటీ మోర్చా నాయకులు అల్బర్ట్, మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కాండ్రేగుల రామకృష్ణ, శేషాలత, సౌమ్య, కోటేశ్వరరావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రీ షెడ్యూల్‌తో ఆలస్యంగా బయలుదేరిన పలు రైళ్లు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల రీత్యా పలు రైళ్లను మంగళవారం రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా బయలుదేరాయి. సాయంత్రం 5.45 గంటలకు విశాఖ నుంచి బయలుదేరాల్సిన విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532) రాత్రి 7.30 గంటలకు కదిలింది. సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరాల్సి విశాఖ-రాజమండ్రి మెమొ పాసింజర్ (67286) రాత్రి 8.20 గంటలకు కదిలింది. హౌరాలో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను(22887) రీ షెడ్యూల్ చేయడంతో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరింది. బ్రహ్మపూర్, రాజమండ్రి పాసింజర్ రైళ్ల రీ షెడ్యూల్ చేయడంతో ఇటు విజయనగరం, శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాలవారితోపాటు అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రోజువారీ విధులకు వెళ్లివచ్చేవారుఇబ్బంది పడ్డారు.

విద్యార్థులకు యోగాసనాల శిక్షణ



విద్యార్థినులతో యోగా సాధన చేయిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యోగాసనాల శిక్షణ ఇచ్చారు. ఈ నెల 21న నగరంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు ఆసనాలు వేసేందుకు ముందస్తు అవగాహన కల్పించారు. ఇందుకోసం యోగాలో శిక్షణ పొందిన ఉద్యోగులు కళాశాలకు చేరుకుని విద్యార్థులకు ఆసనాలు నేర్పించారు. సుమారు గంటన్నర సమయం విద్యార్థులతో వివిధ భంగిమలు, శ్వాస నియంత్రణ పద్ధతులను వివరించారు. యోగా ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు సన్యాసినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పటిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ఎంవీపీ కాలనీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలలా ఉన్నాయి.

ఎంవీపీ కాలనీలోని సీఎమ్మార్ కార్లాన్ అనే సంస్థలో మారికవలసకు చెందిన ఉప్పల సత్య జగన్నాధరావు(40) గ్రైండర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం పని చేస్తుండగా నేలపై నీరు ఉండడం వల్ల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అయితే కంపెనీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తన భర్త మృతి చెందినట్టు మృతుడి భార్య ఉప్పల సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగా డే వేడుకల నిర్వహణపై మంత్రి లోకేశ్ సమీక్ష

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని అధికారులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సూచించారు. యోగా డే వేడుకలపై మంగళశారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ సాగరిక కన్వెన్షన్ హాల్‌లో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదో చారిత్రక కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ వర్షం పడితే ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపీ శ్రీభరత్, విప్‌లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారి

విశాఖలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎంటీ కృష్ణబాబు ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన 247 కంపార్టుమెంట్లలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు ఒక్కొక్క గెజిటెడ్ అధికారికి బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలంతా ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా వారిని నిర్దేశిత కంపార్ట్‌మెంట్లలోకి అనుమతిస్తామన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం రెండు వేల మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లకు ఎంపిక చేశామని, వారందరినీ ముందురోజు రాత్రే ఏయూ గ్రౌండ్స్‌కు రప్పిస్తామన్నారు. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్‌లు సిద్ధం చేశామని, హాజరయ్యే వారందరికీ మ్యాట్స్, టీషర్ట్ ఆయా కంపార్ట్‌మెంట్ వద్ద అందించనున్నట్టు తెలిపారు. 1400 బయో టాయ్‌లెట్లను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. విశాఖతోపాటు పరిసర జిల్లాల నుంచే వచ్చే ప్రజల కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, ఎనిమిది వేల ప్రైవేటు, స్కూలు బస్సులు సిద్ధం చేసినట్టు తెలిపారు.

భవిష్యత్తు అవసరాల కోసమే మెట్రో రైలు

» రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి » ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ శ్రీభరత్


ఫ్యాప్సీ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భవిష్యత్తు అవసరాల కోసం రూ.15 వేల కోట్ల వ్యయంతో మెట్రో రైలు ప్రాజెక్టును చేపడుతున్నామని, అలాగే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి వీలుగా రూ.450 కోట్లతో మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం జరుగుతోందని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. హోటల్ గ్రాండ్ బేలో ఫ్యాప్సీ మంగళవారం నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు. మెట్రో రైలు ప్రాజెక్టు డీపీఆర్ దశలోనే ఉందని, డబుల్ డెక్కర్ మోడల్‌లో నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు దీటుగా పోటీగా నిలపాలంటే అందరి సలహాలు, సూచనలు అవసరమన్నారు. విద్యా వ్యవస్థ-పారిశ్రామిక రంగం-ప్రభుత్వం మధ్య చాలా గ్యాప్(దూరం) ఉందని, ఒకరితో మరొకరు సమన్వయంతో పనిచేయాల్సి అవసరం ఉందన్నారు. బ్యూరోక్రసీ, కాలం చెల్లిన చట్టాల వల్ల సమస్యలు వస్తాయని, వాటిని సవరించుకొని ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. ప్రభుత్వానికి ఆయా రంగాల నుంచి సమాచారం అందిస్తే తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్‌తో కలిసి 11 మంది పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ ఎక్సలెన్స్-2025 అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఇకపై ఏటా ఈ అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అవార్డ్స్ కన్వీనర్ కరుణేంద్ర, ఉపాధ్యకులు ఎ.సత్యనారాయణ సంస్థ ప్రగతిని వివరించారు.

ఫీజులు తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

సీతంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులను, పుస్తకాలు, యూనిఫాం వ్యాపారాన్ని అరికట్టాలని నినాదాలు చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సీతంపేట ప్రధాన రహదారిలోని శ్రీవిశ్వ ప్రధాన కళాశాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పరిష్కరించాలని ఒత్తిడి తెచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.అజయ్ మాట్లాడుతూ జిల్లాలో నారాయణ, చైతన్య, శ్రీవిశ్వ, అన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్ మీడియట్ బోర్డు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా వేలాది రూపాయలకు పుస్తకాలు, యూనిఫాం, తదితర వస్తువులను అక్రమంగా విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ఒక్కొక్క విద్యార్థికి అదనంగా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు తల్లిదండ్రుల వద్ద దోచుకుంటున్నాయన్నారు. వీరి దోపిడీని అడ్డుకుంటామని అన్నారు. విద్యాశాఖ మంత్రి స్పందించి తల్లిదండ్రులకు భారం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె నాయుడు, ఉపాధ్యక్షుడు డి.వెంకటరమణ, ప్రతినిధులు కౌశిక్, శశికుమార్, కుసుమంజలి, మౌనిక, ప్రగతి, కావ్య, గుణ, వినయ్, నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా చక్రవర్తి

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 (అనకాపల్లి) కమిషనర్‌గా కె.చక్రవర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై జీవీఎంసీలో పోస్టింగ్ ఇచ్చింది. అలాగే విజయనగరం కో-ఆపరేటివ్ శాఖలో ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న బి.సన్యాసినాయుడును డిప్యూటేషన్‌పై జీవీఎంసీ డీపీఓగా నియమించింది. ప్రస్తుతం డీపీఓగా పనిచేస్తున్న డి.లక్ష్మి వచ్చే నెల 31న ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఆమె స్థానంలో చేరాలని సూచించింది. వెయిటింగ్‌లో ఉన్న గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లు టి.టి.రత్నకుమార్, పీపీ ప్రసన్నవాణికి జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్లుగా పోస్టింగ్ ఇచ్చింది.

సూపర్ బజారు ఎండీగా శ్రీరామమూర్తి



విశాఖపట్నం సూపర్ బజారు మేనేజింగ్ డైరెక్టర్‌గా పి.శ్రీరామమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సహకార శాఖాధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడ ఎండీగా నియమించారు.

నేడు ఏరువాక పౌర్ణమి వేడుకలు

మురళీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బి.ప్రసాద్ తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, నిజపాద దర్శనం, అష్టోత్తర కలశాభిషేకం, పుష్పాంజలి సేవలు జరుగుతాయన్నారు. పుష్పాంజలి సేవ కోసం భక్తులు వివిధ రకాల పుష్పాల్ని మందిరానికి తీసుకురావచ్చని అన్నారు.

లోకేశ్ ప్రజా దర్బార్

(5వ పేజీ తరువాయి)
దిగారు. పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇంకా దాడి వీరభద్రరావు, బుద్దా నాగజగదీష్, దాడి రత్నాకర్, మహ్మద్ నజీర్, పీవీజీ కుమార్, నాయకులు కలిశారు.

పల్లా కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ పరామర్శ

(5వ పేజీ తరువాయి)
సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. పల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సింహాచలం మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

(5వ పేజీ తరువాయి)
శాఖ ప్రకటించింది. అయితే బుధవారం ఒకటో నంబరు నుంచి 300 వరకూ మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపింది. గురువారం నుంచి ఏ ర్యాంకు నుంచి ఏ ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహించేదీ ప్రకటిస్తామని పేర్కొంది. కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయం ఏజెన్సీ, మైదానం నుంచి వచ్చిన టీచర్లు గంటల తరబడి పడిగాపులు కాశారు. తీరా బుధవారానికి కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో తిరిగి సొంతూళ్లకు వెళ్లడానికి రవాణా సదుపాయం లేకపోవడంతో నగరంలోనే బస చేయాల్సి వస్తోందని పలువురు టీచర్లు వాపోతున్నారు.

నేటి నుంచి నీటి సరఫరా విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె

(5వ పేజీ తరువాయి)
బుధవారం నుంచి సమ్మెకు దిగుతామని పేర్కొంటూ జీవీఎంసీ కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.ఆనందరావు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.01 గంటలకు కార్మికులంతా టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని ప్రధాన పంప్‌హౌస్ వద్దకు చేరుకోవాలని వాటర్‌సప్లై కార్మికులకు పిలుపునిచ్చారు. మరోవైపు సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి సైతం నీటి సరఫరా విభాగంలో స్కిల్డ్ విధులు నిర్వర్తిస్తున్నవారికి జీతాలు పెంపుదల అమలుచేయాల్సిందేనని, లేనిపక్షంలో తాము కూడా సమ్మెకు దిగుతామని పేర్కొంటూ అధికారులకు నోటీసు అందజేశారు. దీంతో బుధవారం నుంచి నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కలగడం ఖాయమని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


56వ వార్డులో కేకు కోస్తున్న టీడీపీ నాయకులు

కంచరపాలెం/అక్కయ్యపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు జీవీఎంసీ 56వ వార్డులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెడ్డికంచరపాలెం ఆర్చ్ సమీపంలోని పార్టీ కార్యాలయం ఇందుకు వేదిక అయ్యింది. సీనియర్ నాయకుడు బింగిరాజు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాత 36వ వార్డు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కేకు కోసి తమ అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమానులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు జోగా మహేష్, యలమంచిలి కనకేశ్, బండారు అప్పలరాజు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పూజారి శివ, సంపత్, బాబూరావు, వైవీవీ అదినారాయణ, మహిళా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో 55వ వార్డు యెల్లబిల్లివీధిలో వేడుకలు జరిగాయి. ఆమె కేకు కోసి మహిళలకు పండ్లు, చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఉత్తర నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు తోట శ్రీదేవి, పార్లమెంట్ తెలుగు మహిళ డి.లక్ష్మీలావణ్య, వార్డు నాయకులు ఈశ్వరరావు, బాబూరావు, వీరుబాబు, వెంకటరమణ, అప్పారావు, తెలుగు మహిళలు ఎం.లక్ష్మి, పి.చింతలమ్మ, పి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ లోకోమోటివ్ అప్‌గ్రేడ్ పోటీల్లో విశాఖకు ద్వితీయ స్థానం


ట్రోఫీతో డీఆర్ఎం, ఏడీఆర్ఎంలు, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ లోకోమోటివ్ అప్‌గ్రేడ్ బ్యూటీ కాంటెస్టులో విశాఖలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్ వైడ్ బ్రాడ్ గేజ్ ఏసీ ఎలక్ట్రిక్ పాసింజర్, క్లాసు-7 (డబ్లుఏపీ7) సిబ్బంది ద్వితీయ స్థానం సాధించారు. బనారస్ లోకోమోటివ్ వర్క్సులో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా భారతీయ రైల్వేకు చెందిన వివిధ జోన్‌ల నుంచి 13 లోకోమోటివ్‌లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో పాల్గొన్న విశాఖ ఎలక్ట్రికల్ లోకోషెడ్ సిబ్బంది, డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ షణ్ముఖరావు మార్గదర్శకాల మేరకు రైల్వే బోర్డు ఆదేశాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో డబ్లుఏపీ7 లోకోమోటివ్ 37419లో అప్‌గ్రేడ్‌లో భాగంగా వినూత్న మార్పులు చేసి ద్వితీయ స్థానంలో నిలిచింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ సిబ్బంది విధుల నిర్వహణలో చూపుతున్న నిబద్ధత, నైపుణ్యాన్ని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, శాంతరామ్, అధికారులు అభినందించారు.

రెవెన్యూలో బదిలీలు

(5వ పేజీ తరువాయి)
ఉద్యోగుల్లో వినిపిస్తోంది. పలు కారణాలతో కొందరు బదిలీల నుంచి తప్పించుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పెందుర్తి తహశీల్దారుగా నియమితులైన అల్లూరి జిల్లా జీకే వీధి తహశీల్దార్ టి.రామకృష్ణపై పలు ఆరోపణలు ఉన్నాయని, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రాజాం, వంగర, కొత్తూరు మండలాల్లో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడడంతో ఆయన సస్పెండ్ అయ్యారని అంటున్నారు. అటువంటి అధికారిని పెందుర్తి తహశీల్దారుగా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ట్రెజరీ బదిలీల్లో ఒంటెత్తు పోకడలు

జిల్లా ఖజానా కార్యాలయంలో ఐదారు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. బదిలీల కోసం ఏర్పాటైన కమిటీ సోమవారం రాత్రి చర్చించి ఉత్తర్వులను స్వల్పంగా సవరించింది. మొత్తం 34 మందిలో ఐదుగురి వ్యవహారంలో పొరపాట్లు సవరించామని ఇన్‌చార్జి డీటీవో గోవిందరావు తెలిపారు. అయితే కార్యాలయంలో భారీగా మామూళ్లు వసూలుచేసే ఉద్యోగిని వెనుకేసుకు వచ్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా అవుట్ సోర్సింగ్ కింద పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్ల బదిలీలు వివాదాస్పదమయ్యాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నెలకు రూ.16 వేలు, అటెండర్లకు రూ.12 వేలు ఇస్తున్నారు. అంత తక్కువ వేతనంతో పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఎలా బతుకుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇన్‌చార్జి డీటీవో గోవిందరావు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఆపరేటర్లు, అటెండర్ల పోస్టులు పాడేరు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఉన్నాయని, అందుకే వారిని అక్కడకు పంపామన్నారు. అయితే పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న విశాఖకు వారం, పది రోజుల తరువాత తీసుకువస్తామన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి

డాబాగార్డెన్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు పి. రమణికుమారి అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హరివెంకటకుమారి, కార్పొరేటర్లు, మహిళా విభాగం అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చియమ్మపేటలో అన్నదానం

అల్లిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అచ్చియమ్మపేట అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంచపు ఆదినారాయణ తెలిపారు. కాగా ఉదయం స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన, సాయంత్రం దీపారాధన చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గీతం కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు

సాగర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్ ర్యాంకింగ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. రాజా ప్రభు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గీతం వర్సిటీకి ఎన్‌బీఏ గుర్తింపు లభించడం అంత ర్జాతీయంగా వర్సిటీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. దేశంలో అతికొద్ది వర్సిటీలకు మాత్రమే ఎన్‌బీఏ గుర్తింపు ఉందన్నారు. కోర్సుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల్లో నైపుణ్యాలతో పాటు పలు అంశాల పరిశీలన అనంతరం ఎన్‌బీఏ నిపుణుల కమిటీ ఈ గుర్తింపును ప్రకటించిందన్నారు.

ముగిసిన కిశోర వికాస శిబిరం


శిబిరంలో పాల్గొన్న బాలికలు

మద్రిపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు కౌమరదశపై అవగాహనతో ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ మద్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెఎస్‌టీ జ్యోతి అన్నారు. మంగళవారం మద్రిపాలెం నరేంద్రనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర వికాస వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలికలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కౌమార బాలికలను సాధికారపరచడం, వారు తమ కాళ్లపై తాము నిలబడగలిగేలా ప్రేరేపించడం, రక్తహీనత సమస్యను అధిగమించేలా చేసి చదువులు, వృత్తిలో సహాయం చేయడం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం తదితర అంశాల్లో అవగాహన కల్పించామన్నారు. కిశోర కమిటీ కన్వీనర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ఏకాహం

మాధవధార, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జులై 10న గురుపౌర్ణమి వేడుకలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ మురళీనగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఏకాహం జరిపారు. సాయంత్రం అఖండ జ్యోతి వెలిగించారు. నిర్విరామంగా 12 గంటల పాటు సాయి నామస్మరణతో భక్తులు భజన చేశారు. అతిథిగా విచ్చేసిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

సాక్షి మీడియాను నిషేధించాలి

తెలుగు మహిళల భారీ ర్యాలీ


ఆందోళనలో పాల్గొన్న తెలుగు మహిళలు

మహారాణిపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలకు వేదికగా నిలిచిన సాక్షి మీడియాను నిషేధించాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు టీడీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ డిబేట్ పేరుతో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజు మహిళల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రాజధాని అమరావతిపై అక్కసుతోనే సాక్షి మీడియా కుట్రకు తెర తీసిందని ఆరోపించారు. కుట్ర వెనుక మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతీరెడ్డి ఉన్నారని చెప్పారు. మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, నాయకులు అనంత లక్ష్మి, గనగళ్ళ సత్య విజయకుమార్, హారతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి వేడుకలు


పూజ అనంతరం ఎమ్మెల్యే వంశీకి జ్ఞాపికను అందిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలతో మొక్కుబడులు చెల్లించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ఈ ఏడాది ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు లేకుండా, అంతా వేటకు వెళ్లి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మర పడవల సంఘం అధ్యక్షుడు ఎం. లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు పీసీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి మున్నం బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐటీఐ కౌన్సెలింగ్


ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఐటీఐ ప్రవేశాల ప్రక్రియ (కౌన్సెలింగ్) మంగళవారం ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో సుమారు వెయ్యి వరకు సీట్లు కేటాయించినట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు కేటాయింపు పత్రంతో ఐటీఐల విభాగాలకు రిపోర్టు చేయాలని సూచించారు. ప్రధానమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్, కోపా తదితర ట్రేడుల్లో ప్రవేశాలను కల్పించా మన్నారు. ప్రతిభ ప్రాతిపదికన ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా కనకమాంబ మహోత్సవం


ఊరేగింపులో తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

సీతంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కనకమ్మవారి వీధిలో గల త్రిశక్తి మూడుగుళ్ల అమ్మవారి ఆలయంలో గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. చుట్టుపక్కల వీధుల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం, చుట్టు పక్కల వీధుల్లో విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హిందీ డ్రామా పోటీల్లో వాల్తేరు డివిజన్‌కు కాంస్యం

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత హిందీ డ్రామా పోటీల్లో వాల్తేరు డివిజన్‌కు కాంస్య పతకం దక్కింది. భుసావల్‌లో జరిగిన ఈ పోటీల్లో భారతీయ రైల్వేకు చెందిన సాంస్కృతిక విభాగాల జట్లు పాల్గొన్నాయి. తూర్పుకోస్తా రైల్వే నుంచి ప్రాతినిధ్యం వహించిన వాల్తేరు డివిజన్ విభాగం కళాకారుల బృందం 'అఖెయిన్' అనే నాటకాన్ని ప్రదర్శించింది. వీరి స్కిట్ న్యాయనిర్ణేతలు, ఆహూతులను ఆకట్టుకుని మూడో స్థానంలో నిలిచింది. సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా నుంచి ట్రోఫీని అందుకున్న నాటక బృందాన్ని జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బొహ్రా అభినందించారు.

అక్రమార్కులకు మహా దన్ను!

(5వ పేజీ తరువాయి)
అనేదానితోపాటు ఖాళీస్థలమైతే వీఎల్‌టీ, అదే పాత ఇల్లు కూలగొట్టి కొత్తగా నిర్మిస్తే ఇంటి పన్ను పూర్తిగా చెల్లించారా?, లేదా?...అనేది తనిఖీ చేస్తారు. అదే వ్యవసాయ యోగ్యమైన భూమిలో నిర్మాణానికి ప్లాన్ పెడితే మాత్రం భూ వినియోగ మార్పిడి (నాలా) ఫీజు రెవెన్యూ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. నాలా ఫీజు కట్టిన రశీదుతోపాటు వీఎల్‌టీ కింద జీవీఎంసీకి చెల్లించిన ఫీజు రశీదులను దరఖాస్తుతోపాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అలా అయితేనే ప్లాన్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని, నిర్మాణానికి అనుమతిస్తారు. అలాకాకుండా నాలా ఫీజు రశీదు లేకపోతే మాత్రం ప్లాన్ దరఖాస్తును వెనక్కి పంపించేయాలి. ఒకవేళ భవన నిర్మాణదారుడు తాను నాలా ఫీజు తర్వాత చెల్లించి రశీదుని అప్‌లోడ్ చేస్తానని హామీ పత్రం అందజేస్తే మాత్రం అదే షరతును నోట్‌ఫైల్‌లో రాసి ప్లాన్‌ను అనుమతిస్తారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపేషన్ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసేలోపు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఓసీ జారీచేయరు. ఓసీ లేకపోతే ఇంటి పన్ను రెట్టింపు విధించడంతో పాటు జీవీఎంసీకి మార్టిగేజ్ చేసిన ఫ్లాట్‌లను రిలీజ్ చేయరు. అయితే కొంతమంది భవన నిర్మాణదారులు, బడా బిల్డర్లు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులను ప్రసన్నం చేసుకుని నాలా ఫీజు చెల్లించకుండా మేనేజ్ చేసేస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత నాలా ఫీజు చెల్లింపు ప్రస్తావన లేకుండానే ఓసీని తెచ్చుకుంటున్నారు.

కూర్మన్నపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎంవీవీ, ఎంకే పేరుతో 9.57 ఎకరాల్లో రెండు వేల ఫ్లాట్‌లు కలిగిన గేటెడ్ కమ్యూనిటీ నిర్మించారు. దీనికి 2019లో ప్లాన్ కోసం దరఖాస్తు చేయగా, నాలా ఫీజు కింద ఏడు ఎకరాలకు రూ.7.59 కోట్లు చెల్లించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు నోట్ షీట్‌లో రాశారు. తర్వాత నాలా ఫీజును చెల్లిస్తానని బిల్డర్ నుంచి హామీ పత్రం తీసుకుని ప్లాన్ రిలీజ్ చేశారు. 2024లో భవన నిర్మాణం పూర్తయ్యింది. అయితే నాలా ఫీజు కట్టకపోయినాసరే బిల్డర్ ఆక్యుపేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయగానే అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే జారీచేసేశారు. దీనిపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌తోపాటు మరికొందరు ఫిర్యాదు చేయడంతో నాలా ఫీజు కింద రూ.7.59 కోట్లు చెల్లించాలని నోటీసు జారీచేశారు. అయినా ఇంతవరకు నోటీసుని పట్టించుకున్న దాఖల్లాలేవు. పైగా శ్మశాన స్థలాన్ని, ఏలేరు కాలువ బఫర్‌జోన్‌గా మార్కుచేసిన స్థలాన్ని కబ్జా చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా గేటెడ్ కమ్యూనిటీ లోపల అంతర్గత రహదారి కోసం 2,187 గజాల స్థలం విడిచిపెట్టేసినందున పరిహారంగా నాలుగు రెట్లు సెట్ బ్యాక్ ఉల్లంఘనకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అంగీకారం తెలిపారు. ఇదే విషయమై నాలుగు రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. దీనికి మేయర్ పీలా శ్రీనివాసరావు స్పందిస్తూ ఎంవీవీ, ఎంకే పార్క్ గేటెడ్ కమ్యూనిటీ ఉల్లంఘనలపై సమాధానం ఇవ్వాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించగా, నాలా ఫీజు కింద రూ.7.9 కోట్లు బకాయి ఉండగానే ఓసీ జారీచేసిన విషయం వాస్తవమేనని వెల్లడించారు. ఇందుకు కారకులెవరనే దానిపై సమగ్రవిచారణ జరిపి వారంరోజుల్లోగా తనకు నివేదిక అందజేయాలని సీసీపీని మేయర్ ఆదేశించారు.

పరిశ్రమల సవరణ బిల్లు విరమించుకోవాలి : బీఎంఎస్



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

గాజువాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రివర్గం సవరణ చేసిన రాష్ట్ర ఫ్యాక్టరీల -2025 సవరణ చట్టం బిల్లును వెనక్కితీసుకోవాలని బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గాజువాకలో మంగళవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సవరించిన కార్మిక చట్టాలు బ్రిటీష్ పాలనకు నిదర్శనమన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను పూర్తిగా వ్యతిరేకిస్తామని, చట్టాల ఉపసంహరించే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్మిక వర్గానికి హాని కలిగించే చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రొక్కం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

'వాసీవా'లో నేత్ర శిబిరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆటోనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ వాసీవా భవనంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ పరిశ్రమల కార్మికులు, పారిశ్రామికవేత్తలు హాజరై నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 90 మందికి వైద్య సేవలు అందించినట్టు ట్రస్టు నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్. వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు రామప్రసాద్, పరుచూరి ప్రభాకర్, యార్లగడ్డ సాంబశివరావు, శేషగిరిరావు, కొల్లి ఈశ్వరరావు, రామభద్రరాజు, సీహెచ్ సత్యనారాయణ, శ్రీను, నవీన్, వినీత్, కిషోర్, సుబ్బారావు, లంకా బాపిరాజు, రమేష్, వైద్య బృందం పవన్, దేవి, భార్గవి, దివ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం

» రహదారి గుంతల్లో ఎక్కడికక్కడే నిలిచిన నీరు » ఇండస్ట్రియల్ ఎస్టేట్ మార్గంలో వాహనదారుల ఇబ్బందులు

గాజువాక, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లటి వాతావరణం నెలకొంది. ఎండ వేడిమి, ఉక్కపోతకు గురై కొన్ని రోజులుగా పారిశ్రామిక ప్రాంత ప్రజలు అల్లాడిపోయారు. మంగళవారం ఉదయం వర్షం పడడంతో ఉపశమనం పొందార

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు జలమయమైంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు ఉన్నా రోడ్డుమీద నీరు వాటిలోనికి నేరుగా వెళ్లేందుకు వీలు లేకుండా ఎత్తుగా మట్టిగుట్టలు అడ్డు ఉండడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వర్షం నీరు ఇలా రోడ్డు మీద నిలిచిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి కొత్తదిబ్బపాలెం, యాతపాలెం, అశోక్‌నగర్ ప్రాంతాలకు వెళ్లే వారు, ఆటోనగర్‌లోని వివిధ పరిశ్రమలకు రాకపోకలు సాగించే వారికి ఇదే రోడ్డు ఆధారం. ఎప్పుడు వర్షం కురిసినా ఆటోనగర్ ప్రధానరహదారి పరిస్థితి ఇలాగే ఉంటుందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జీవీఎంసీ, ఐలా అధికారులు దీనిపై చర్యలు తీసుకొని రోడుపై వర్షం నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాజువాక : కణితి మార్గంలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు



పెదగంట్యాడ : ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

దువ్వాడ రైల్వే స్టేషన్ సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌ను కలిసి రైల్వే స్టేషన్ సమస్యలను వివరిస్తున్న డీఆర్‌యూపీ సభ్యులు

కూర్మన్నపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ సమస్యలపై మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీభరత్‌కు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఆదర్శ రైల్వే స్టేషన్ అయిన దువ్వాడలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రతి రోజూ రాకపోకలు చేస్తున్న కారణంగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రతి రైలు 2 నిముషాలు మాత్రమే ఆగడం వల్ల ప్రయానికులు ఇబ్బంది పడుతున్నారని, కొన్నిసార్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతి రైలుకు కనీసం 5 నిముషాలు హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే వందే భారత్ రైలుకు దువ్వాడలో హాల్ట్ కల్పించాలని, దువ్వాడ ప్లాట్‌ఫారమ్-1 నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చినట్టు అసోసియేసన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం విశాఖ, దువ్వాడ రైల్వే స్టేషన్ల అభివృద్ధికి, ప్రత్యేక జోన్ ఏర్పాటుకు జీఎం నియామకానికి కృషి చేస్తున్న ఎంపీ శ్రీభరత్‌కు జడ్ఆర్‌సీసీ సభ్యులు కంచుమూర్తి ఈశ్వర్, డీఆర్‌యూసీసీ సభ్యులు చలసాని గాంధీ, డీఈఆర్‌యూఏ సభ్యులు జాషువా, మూర్తి, కామేశ్వరరావు సత్కరించారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గత 32 రోజులుగా సాధారణ ప్రయాణికులకు 10 వేలు మినరల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థ సభ్యులను ఎంపీ అభినందించారు.

ఎన్టీఆర్ నగర్, ప్రకాశ్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మాలినాయుడు

సింధియా, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్ నగర్, ప్రకాశ్ నగర్ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలి నాయుడు శంకుస్థాపనచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు కృషితో వార్డులో ఎన్టీఆర్ నగర్ బ్లాక్ నెంబర్ 10 వద్ద రూ.19 లక్షలతో రిటైనింగ్ వాల్, ప్రకాశ్‌నగర్‌లో రూ.16 లక్షలతో డ్రైన్, రోడ్ల కోసం జీవీఎంసీ నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుర్గా, దిలీప్, శ్రీధర్, శ్రీను, చిట్టిబాబు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ 'కోన'తో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధుల భేటీ



కోన తాతారావును అభినందిస్తున్న నాయీ బ్రహ్మణ సంఘం ప్రతినిధులు

గాజువాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ ఛైర్మన్‌గా నియమితులైన కోన తాతారావును గాజువాకలో నాయీ బ్రహ్మణ సంఘం ప్రతినిధులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ప్రజల కోసం నిత్యం శ్రమించే వ్యక్తిని గుర్తించిడీసీసీబీ ఛైర్మన్ పదవి ఇవ్వడం గొప్ప విషయమని సంఘం ప్రతినిధులు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నేరవేర్చి అన్ని వర్గాలకు మేలు చేస్తానని ఈ సందర్భంగా కోన తాతారావు పేర్కొన్నారు. కోన తాతారావును కలిసిన వారిలో పోలారావు, కృష్ణ, పాపారావు ఉన్నారు.

విద్యుత్ కోతల సమస్య పరిష్కరించండి

» ఏఈకి కణితి కళింగ వీధి వాసుల వినతి



వడ్లపూడి ఏఈ వీర్రాజుకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆటోనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87 వార్డు కణితి కళింగ వీధిలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా రాత్రుళ్లు ఎడాపెడా కరెంటు కోతలు విధిస్తుండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ కళింగ వీధి కాలనీ వాసులు మంగళవారం వడ్లపూడి ఏఈ వీర్రాజుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఏఈ వీర్రాజు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రగడ వేణుబాబు, రాము, దానప్పలు, గోవిందరాజులు, శ్రీను, శంకరరావు, సన్యాసి నాయుడు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తిరుమల నగర్‌వాసులు

కూర్మన్నపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 87వ వార్డులోని తిరుమల నగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు జి.విశ్వేశ్వరరావు, నాగభూషణం మాట్లాడుతూ దోమల నివారణకు తీసురెవాలికప జాగత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాలలో ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, కొబ్బరి బోండాలు, పాడైన టైర్లులో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఇంటి ముందు చెత్తాచెదారాలు వేయవద్దనీ, ఇంటికి వచ్చిన జీవీఎంసీ సిబ్బందికి తడి-పొడిచెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. తడి పొడి చెత్త- సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు జాగ్రత్తలు, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల నిషేధం తదితర అంశాలపై పాటించవలసిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, ఇజ్రాయిల్, వసంత రెడ్డి, పలువురు కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలి'



ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ విశాఖ పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి తదితరులు

గాజువాక, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళల వ్యక్తిత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియాపై, కృష్ణంరాజు, కేఎస్ఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గాజువాక పోలీసులకు టీడీపీ విశాఖ పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి మంగళవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర రాజధాని ప్రాంతాన్ని అపహస్యం చేసే విధంగా మహిళలపై అనుచిత వాఖ్యలు చేశారని, ఇది క్షమించరాదన్నారు. అలాగే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

బొర్రమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, పరిసర ప్రాంత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ ఉత్సవం

వేపగుంట జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డులో పైడిమాంబ అమ్మవారి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 24, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 44 దొండకాయలు 24, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 32, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

ముగిసిన వైద్యశిబిరం

మల్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు జూన్ 21న వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) సహకారంతో షిప్‌యార్డులో ఉన్న ప్రైమ్ హెల్త్ సెంటర్‌లో కార్మికులకు 9, 10 తేదీల్లో వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడారు. వంద శాతం ఆరోగ్యసంరక్షణ ధ్యేయంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 500 పైగా కార్మికులకు వైద్యసేవలు అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ రాజేంద్రన్, డీజీఎం ఆర్. కోటేశ్వరరావు, షిప్‌యార్డు ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక హక్కులపై దాడి'

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సవరణ బిల్లు-2025 కార్మిక హక్కులు, వారి ఆత్మగౌరవంపై దాడిగా ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వీఎస్ కృష్ణ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. పనిదినాన్ని పది గంటలకు పెంచుతూ రూపొందించిన ఈబిల్లును రాష్ట్రమంత్రివర్గం ఆమోదించడం కార్మిక హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల చట్టాన్ని (19 48) సవరిస్తూ, దీన్ని సంస్కరణగా ప్రభుత్వం ప్రచారం చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ఇలాంటి చట్టాలు తేవడం సరైంది కాదని అన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పనిదినం ఆయువుపట్టు అని, కార్మికోద్యమాల ద్వారా దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న హక్కు అని, ఎనిమిది గంటల పనిదినాన్ని వ్యవస్థీకృతం చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

రీ షెడ్యూల్‌తో ఆలస్యంగా బయలుదేరిన పలు రైళ్లు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల రీత్యా పలు రైళ్లను మంగళవారం రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా బయలుదేరాయి. సాయంత్రం 5.45 గంటలకు విశాఖ నుంచి బయలుదేరాల్సిన విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532) రాత్రి 7.30 గంటలకు కదిలింది. సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరాల్సి విశాఖ-రాజమండ్రి మెమొ పాసింజర్ (67286) రాత్రి 8.20 గంటలకు కదిలింది. హౌరాలో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (22887) రీ షెడ్యూల్ చేయడంతో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరింది. బ్రహ్మపూర్, రాజమండ్రి పాసింజర్ రైళ్ల రీ షెడ్యూల్ చేయడంతో ఇటు విజయనగరం, శ్రీకాకుళం చుట్టుపక్కల ప్రాంతాలవారితోపాటు అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రోజువారీ విధులకు వెళ్లివచ్చేవారు ఇబ్బంది పడ్డారు.

సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసనలు



పెందుర్తిలో ర్యాలీ చేస్తున్న టీడీపీ నేతలు, మహిళలు

మల్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచే విధంగా డిబేట్ నిర్వహించిన సాక్షి యాజమాన్యం, ఎనలిస్ట్ కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పారిశ్రామిక ప్రాంతంలో వందలాది మంది మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి వద్ద ఉన్న అన్నక్యాంటీన్ నుంచి రామకృష్ణపురం యారాడ పార్కు గేటు వరకు సాక్షి యాజమాన్యానికి వ్యతిరేక నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేశారు. పలువురు మహిళలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అమరావతిని దేవతల రాజధానిగా భావిస్తుంటే, రాజకీయ దురుద్దేశంతో వేశ్యల రాజధాని అనడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన సాక్షి సంస్థ లైసెన్స్‌ను రద్దు చేయాలని, మహిళల గౌరవాన్ని కాపాడాలని వారు కోరారు. వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదని వచ్చే ఎన్నికల్లో ఒక్కస్థానం కూడా దక్కకుండా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం.ఉమామహేశ్వరీ, 61వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు సర్వసిద్ధి పాల్గొన్నారు.

పెందుర్తి: రాజధాని మహిళనలు కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రముక పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఎనలిస్టు కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణరెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలనిమహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జర్నలిస్టుల ముసుగులో మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరిగినా మాజీ సీఎం జగన్, భారతి రెడ్డి స్పందించకపోవడం దారుణమని మహిళలు ఆందోళన చెందారు.



సాక్షి లైసెన్స్‌ను రద్దుచేయాలని ర్యాలీ చేస్తున్న మహిళలు

ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

పెందుర్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు 'బాలయ్య టీం' ఆధ్వర్యంలో మంగళవారం చినముషిడివాడలోని పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి కేక్‌ను కట్ చేని అభిమానులకు తినిపించారు. అనంతరం బాలకృష్ణ పేరిట ఆలయంలో ఆర్చన చేయించారు. కార్యక్రమంలో బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

మల్కాపురం: గాజువాక స్టీల్‌సిటీ నందమూరి అభిమానుల అధ్యక్షుడు నమ్మి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో హిమచల్‌నగర్ జంక్షన్ పెంటమాంబ ఆలయం వద్ద పద్మవిభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ రాజకీయ రంగంలోను, సినీ రంగంలో ఎనలేని విజయాలు సాధిస్తు అభిమానుల మన్ననలు పొందుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



బాలకృష్ణ జన్మదిన వేడుకలో మాట్లాడుతున్న గౌరీశ్వరరావు

టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌గా హెచ్ఐక్యూ షిప్పింగ్

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ చాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో రెండు రోజులు జరిన ఈ టోర్నీలో ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్, లాల్‌వెన్షిమ్ టాటా, స్పార్టాన్స్, హెచ్ఐక్యూ షిప్పింగ్, సుందరనీడి షూటర్స్ విక్టరీ షిప్పింగ్ ఏజెన్సీ జట్లు పాల్గొన్నాయి. ప్రతి ఫ్రాంచైజ్ జట్టులో గ్రేడ్‌ల ఆధారంగా ఐదుగురు క్రీడాకారులు జట్టుగా ప్రాతినిధ్యం వహిం చి ప్రతిభను ప్రదర్శించారు. ఆసక్తికరంగా సాగిన ఈ టోర్నీలో 23 పాయింట్లతో హెచ్ఐక్యూ షిప్పింగ్ చాంపియన్ ట్రోఫీని కైవ సం చేసుకోగా, 22 పాయింట్లతో సుందరనీడి షూటర్స్ రన్నరప్‌గా నిలిచింది. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ మూడో స్థానం దక్కించుకుంది. మంగళవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఐఆర్‌టీఎస్ అధికారి హిమకర్ టాటా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.మాధవస్వామి, సురేంద్ర, కేవీ ఎస్ఎన్.రాజు ప్రత్యేక అతిథులుగా హాజరుకాగా, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి మురళిపాత్రుడు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

డీసీసీబీ చైర్మన్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందనలు



అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

ఎస్.ఎ.డి.జంక్షన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్ డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కార్యాలయంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్మన్ తాతారావు అయ్యన్నను సన్మానించారు. కొద్దిసేపు ఇద్దరి మధ్య మంతనాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడు, జీవీఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ పటాబి, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన రూట్స్ అకాడమీ క్రీడాకారులు



బహుమతులు అందుకుంటున్న అకాడమి క్రీడాకారులు

పెందుర్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ విశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10 వరకు జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలను జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించారు. ఈ పోటీల్లో పోర్లుపాలెం రూట్స్ బాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికై సత్తా చాటారు. కోచ్ రవిబాబు వివరాల ప్రకారం అండర్ 11 బాలికల డబుల్స్‌లో అక్షర విజేతగా నిలిచింది. అండర్ 15 విభాగంలో దర్శిని, శాన్విరాజ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్ 11 పురుషుల విభాగంలో లోచన్, దినేశ్ రన్‌రప్‌గా నిలిచారు. అండర్ 17 విభాగంలో కార్తీక్, రాజా రన్నరప్‌గా నిలిచారు. ఈ పోటీల్లో తమ అకాడమి క్రీడాకారులు చక్కటి ప్రదర్శన చూపడంతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని రూట్స్ బాడ్మింటన్ కోచ్ రవిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయక కోచ్‌లు రాజేశ్, సాయి పాల్గొన్నారు.

వెంకటాద్రిపై శ్రీవారి కల్యాణం



వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి శిఖరంపై కొలువైయున్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జేష్ఠ మాసం సందర్భంగా మంగళవారం శ్రీనివాస, పద్మావతి, మంగాదేవిల కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ వేదికను ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు.

నేడు సహస్ర నారికేళాభిషేకం

శ్రీవారికి 1008 కొబ్బరిబొండాలతో అభిషేకం బుధవారం నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు మహర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. జేష్ఠ మాసంలో జేష్ఠ నక్షత్రంతో కూడిన పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఈ అభిషేకం నిర్వహించనున్నామని తెలిపారు. 27 నక్షత్రాలను 27 కలశాల్లోకి ఆవాహన చేసి ఈ అభిషేకాన్ని నేత్రపర్వంగా చేపడతామని చెప్పారు.

మంత్రి లోకేశ్ పర్యటన దృశ్యమాలిక



ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవానికి విశాఖపట్నం విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో కృషిచేయాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. బీచ్ రోడ్డులోని సాగరిక కన్వెన్షన్‌లో మంత్రులు, అధికార, అనధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, శాసనసభ్యులు తదితరులు



జిల్లా టీడీపీ కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన ప్రజల సమస్యలు ఆలకిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌కు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎగబడుతున్న ప్రజలు

సీతంపేటలో ఇటీవల కన్నుమూసిన మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, చిత్రంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు





విశాఖపట్నంలో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) మంగళవారం నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 ప్రదానోత్సవంలో దాల్మియా సిమెంట్స్ వారికి అవార్డు అందజేస్తున్న పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్



అవార్డు అందుకుంటున్న అరవింద్ ఇండస్ట్రీస్ ప్రతినిధి



శారద మెటల్స్ అండ్ అల్లోయిస్ లిమిటెడ్ ప్రతినిధి

నెక్కంటి సీఫుడ్స్‌కి ఎక్సలెన్స్ ఇన్ అగ్రి అండ్ ఆక్వా ఇండస్ట్రీస్ అవార్డు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెక్కంటి సీఫుడ్స్ అధ్యక్షుడు నెక్కంటి సుబ్బారాయుడు ఎక్సలెన్స్ ఇన్ అగ్రి అండ్ ఆక్వా బేస్డ్ ఇండస్ట్రీస్ అవార్డు అందుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ విశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ నుంచి ఈ అవార్డును అందుకున్నారు. నెక్కంటి సీఫుడ్స్ సీఎఫ్ఓ ఎం.నగేష్, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్‌ల నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.



ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న నెక్కంటి సుబ్బారాయుడు

దివ్యాంగులకు అనుకూలంగా భవనాల నిర్మాణం

- నేడు, రేపు మెడ్‌టెక్ జోన్‌లో సమావేశాలు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అనుకూలంగా భవనాలు నిర్మించడానికి ఏపీ మెడ్‌టెక్ జోన్ ముందుకు వచ్చింది. ఇక్కడ అన్ని భవనాల్లోకి దివ్యాంగులు సులువుగా వెళ్లడమే కాకుండా, వారికి అవసరమైన సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా ప్రజలు అధికంగా సందర్శించే ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ విధానం అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. దీని కోసం ఈ నెల 10, 11 తేదీల్లో మెడ్‌టెక్ జోన్‌లో దివ్యాంగులకు యాక్సెస్‌బులిటీ, వైకల్య హక్కులు, ఆర్కిటెక్చర్, టౌన్ ప్లానింగ్‌లో చేయాల్సిన మార్పులపై ఆయా రంగాలకు చెందిన 50 మంది నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ తరువాత నిబంధనలు రూపొందిస్తారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, గర్భిణులు తదితర వర్గాలు ఏ భవనంలోకైనా సులువుగా వెళ్లేలా నిర్మాణాలు చేపట్టడమే దీని ఉద్దేశం. ప్రవేశ ద్వారం, ర్యాంప్‌లు, మార్గదర్శక సూచికలు, వాష్ రూమ్‌లు, లిఫ్ట్‌లు, పాత్‌వేలు, డిజిటల్ యాక్సెస్‌బిలిటీ వంటివి అందులో ఉంటాయి. వీటన్నింటిని "పర్పుల్ బిల్డింగ్ సర్టిఫికేషన్ స్కీమ్" కింద చేర్చి, అందులో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సీఈఓ జితేంద్ర శర్మ మంగళవారం తెలిపారు.



మెడ్‌టెక్ జోన్ భవనం

సింహాచలం దేవస్థానం ఉద్యోగులకు బదిలీలు

సింహాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానానికి చెందిన పలువురు ఉద్యోగులను వివిధ దేవాలయాలకు బదిలీ చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యనిర్వాహక ఇంజినీరు బండారు రాంబాబును విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి, డిప్యూటీ ఈఈ డీవీఎస్ రామరాజు (హరి)ను నగరంలోని ఎస్‌కేఎంఎల్ దేవస్థానానికి బదిలీ చేశారు. పర్యవేక్షణాధికారి సునీల్‌ను అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ బి.అనురాధను ఎస్‌కెఎంఎల్ దేవస్థానానికి, డి.వెంకట రమణను అరసవల్లికి, జూనియర్ అసిస్టెంట్లు ఎన్. కార్తీక్‌ను ఎస్‌కెఎంఎల్ దేవస్థానానికి, బాల భాస్కర్‌సాయిని అరసవల్లికి బదిలీ చేశారు. దేవస్థానం అధికారుల నివేదిక ప్రకారం సుమారు 20 మంది బదిలీ కావాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే బదిలీ కావడం పట్ల స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

యోగా వేడుకలకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సిద్ధమవుతున్న వేదిక

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకల నేపథ్యంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వేలాది మంది యోగా వేడుకల్లో పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ఎంతో మంది ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు, అలాగే పార్క్ హోటల్ జంక్షన్ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వరకు ఉన్న రోడ్డులో కూడా కొంత మంది యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ యోగా డే రోజున వర్షం కురిస్తే ప్రధాని సహా ఇతర ప్రముఖులు యోగా వేడుకల్లో పాల్గొనేందుకు అనుగుణంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం పడకపోతే యథావిధిగా ఇక్కడ కూడా యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.16,500 విలువ చేసే 3.3 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మంగళవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన అనిత్ బాగ్ అనే నిందితుడు బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా నిందితుడికి శిక్ష ఖరారు

విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా 2014లో 24 కిలోల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ ప్రధాన నిందితుడు కొర్ర ప్రశాంత్‌కుమార్‌కు విశాఖపట్నం మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి పదేళ్ల కఠిన కారాగారం, రూ.లక్ష జరిమానా విధించారని విశాఖ జీఆర్పీ హౌస్ ఆఫీసర్ సి.హెచ్.ధనుంజనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు



వారణాసి కామేశ్వరరావు (ఫైల్)

కంచరపాలెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ అదృశ్యంపై అతడి సోదరుడు మంగళవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్.ఐ. రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారణాసి కామేశ్వరరావు(38) ఈ నెల 3న లారీ లోడుతో విశాఖపట్టణం పోర్టుకు వచ్చి అన్‌లోడ్ చేయించిన అనంతరం లారీని పార్కింగ్ యార్డులో ఉంచాడు. అనంతరం అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. రోజులు గడుస్తున్నా కామేశ్వరరావు ఇంటికి తిరిగి చేరకపోవడంతో అతని సోదరుడు సాంబశివరావు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలియజేశారు.

పెందుర్తిలో పోలీసు యూనిఫామ్‌లో హల్‌చల్

- జంటను బెదిరించి రూ.5 వేలు దోపిడీ
- క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా నగదు బదిలీ
- కేసు నమోదు

పెందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో పోలీసు యూనిఫామ్ వేసుకుని ఇద్దరు హల్‌చల్ చేశారు. బైక్‌పై వెళుతున్న యువ జంటను అడ్డగించి రూ.5 వేలు లాక్కున్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ స్నేహపురి కాలనీకి చెందిన కోరాడ జయరాం తనకు కాబోయే భార్యతో కలసి ఈ నెల 6న రాత్రి 10 గంటల సమయంలో అడివివరం మీదుగా బైక్‌పై విజయనగరం వెళుతున్నారు. అడివివరం భైరవకోన ఎస్ఆర్‌పురం మార్గంమధ్యలో కాల్ రావడంతో బైకును ఆపి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న జయరాం వద్దకు పోలీసులమంటూ ఇద్దరు వచ్చారు. ఇందులో ఒకరు యూనిఫాం ధరించగా, మరొకరు సాధారణ దుస్తులతో ఉన్నాడు. రాత్రిపూట మీకేం పని అని ప్రశ్నించి అరెస్ట్ చేసి, బైక్ సీజ్ చేస్తామని తమదైన శైలిలో జంటను బెదిరించారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లకుండా ఉండాలంటే రూ.20 వేలు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో భీతిల్లిన జయరాం ప్రాధేయపడ్డాడు. అయినా వారు దౌర్జన్యంగా సెల్‌ఫోన్ తీసుకుని ఫోన్‌పే చేయాలని బెదిరించారు. తన సెల్‌ఫోన్ తీసి క్యూఆర్ కోడ్ చూపి నగదు బదిలీ చేయించుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు చేశారు.

క్రైం... crime news

పోలీసులతో 'దొంగాట'

- ఎట్టకేలకు చిక్కిన రౌడీషీటర్
- ఏడాదిగా పరారీలో ఉన్న శ్రీరామ్‌వినయ్



శ్రీరామ్‌వినయ్

మల్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా పోలీసుల కళ్లుకప్పి తిరుగుతున్న రౌడీషీటర్ శ్రీరామ్ వినయ్‌ను మల్కాపురం పోలీసులు సినిఫక్కీలో పట్టుకున్నారు. సోమవారం మధ్యాహ్నం అతడు శరీరంపై దుస్తులు లేకుండా, చిన్నషార్ట్ వేసుకొని శ్రీహరిపురం రామ్‌నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్కాపురం పోలీసులు రామ్‌నగర్ చేరుకున్నారు.. అక్కడ పాడుబడిన ఇంట్లో శ్రీరామ్ వినయ్ నక్కి ఉండడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన వెంటనే అతడు ఒక్క ఉదుటన గోడ ఎక్కి పైనుంచి దూకి పారిపోయాడు. అలా రామ్‌నగర్‌లోని ఇళ్లలోకి ప్రవేశించడం... ఆ ఇంటి వారు గట్టిగా ఎదురుతిరగడంతో మరో ఇంట్లోకి వెళ్లిపోవడం.. ఇలా గంటపాటు పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని చెమటలు పట్టించాడు. చివరికి మహిళలు ఉంటున్న ఇంట్లోకి వెళ్లాడు..వారు పెద్దగా కేకలు వేసి ఇంటి నుంచి బయటకొచ్చేయడంతో పోలీసులు లోనికి ప్రవేశించారు. అక్కడ చిక్కినట్టే చిక్కి పారిపోయాడు.. ఇంక దొరికేటట్టు లేడని పోలీసులు తిరిగి స్టేషన్‌కు వెళ్లిపోతుండగా, సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద అటు ఇటు తిరుగుతుండగా పోలీసులు అమాంతం అతడ్ని పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రౌడీషీటర్ వినయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చింతగట్లలో చోరీ వట్టిదే

- 10 తులాల బంగారం చోరీ అంటూ పోలీసులకు కాల్
- క్లూస్ టీంతో వెళ్లిన పోలీసులు
- బియ్యంమూటలో బంగారం ఉందన్న బాధితులు
- ఫిర్యాదు లేకపోవడంతో నమోదుకాని కేసు



చింతగట్లలో విచారణ చేస్తున్న క్రైమ్ ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): చింతగట్లలో చోరీ జరిగిందన్న సమాచారం నేర విభాగ పోలీసులను పరుగులు పెట్టించింది. సంఘటన స్థలంలో విచారణ చేపట్టిన పోలీసులు ఇందులో నిజం లేదని నిర్ధారించారు. క్రైమ్ ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం ఉదయం చింతగట్లలో పది తులాల బంగారం అపహరించారని ఓ వ్యక్తి 112కి కాల్ చేయడంతో పెందుర్తి క్రైమ్ ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది హడావుడిగా అక్కడికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించే పని చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులను విచారించే క్రమంలో యజమాని గొంప ఆనంద్ కుటుంబసభ్యులు సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి మేడపై నిద్రించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నిద్ర లేచి ఇంటి తలుపులు తీసి లోనికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన పది తులాల బంగారం కనిపించలేదు. దీంతో ఆందోళన చెంది 112కి కాల్ చేశాడు. ఇంటిలో చోరీ జరిగిన ఆనవాళ్లు పోలీసులకు కనిపించలేదు. అనుమానం రావడంతో కుటుంబ సభ్యులను తమదైన శైలిలో విచారించారు. కొంతసేపటి తరువాత ఫోన్ చేసిన వ్యక్తి ఇంటిలో బియ్యంమూటలో బంగారం భద్రంగానే ఉందని తెలిపాడు. దీంతో చోరీ జరగలేదని నిర్ధారించుకుని పోలీసులు వెనుదిరిగారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు లేకపోవడంతో ఎటువంటి కేసు నమోదు చేయలేదని, తప్పుడు ఫిర్యాదు చేయడం తగదని వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ చెప్పారు. చోరీ ఘటనలో తెలిసిన వారి ప్రమేయం ఉండవచ్చునని, ఇది వివాదం అవుతుందని గ్రహించి పోయిందని చెప్పి దాచిపెట్టిన బంగారం చూపించారని పోలీసులు అంటున్నారు.

లారీడ్రైవర్ హత్య ఘటనలో ఆరుగురిపై కేసు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టులో లారీడ్రైవర్‌ను తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలో ఆరుగురిపై కేసునమోదు చేసినట్టు హార్బర్ పోలీసులు తెలిపారు. పోర్టులో బొగ్గు హ్యాండ్లింగ్ చేసే ఒక కంపెనీలో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న సన్యాసిరావు బొగ్గు చోరీచేశాడనే అభియోగంపై అతనితోపాటు సూపర్‌వైజర్‌ను కంపెనీ ప్రతినిధులు ఒక గదిలో నిర్బంధించి తీవ్రంగా కొట్టారు. లారీడ్రైవర్ సన్యాసిరావు దెబ్బలకు తాళలేక స్పృహతప్పి పడిపోవడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సూపర్‌వైజర్ అహ్మద్‌ను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి కంపెనీ ప్రతినిధులే వైద్యం చేయిస్తున్నారు. సన్యాసిరావు మృతికి కారణమైన కంచరపాలెంకు చెందిన రౌడీషీటర్‌తోపాటు మరో ఐదుగురి ప్రమేయం ఉన్నట్టు గుర్తించిన పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. బుధవారం వారందరినీ రిమాండ్‌కు తరలించనున్నట్టు పోలీసులు తెలిపారు. పోర్టులో బొగ్గుహ్యాండ్లింగ్ చేస్తున్న కంపెనీ ఒక రౌడీషీటర్‌ను సెక్యూరిటీ ఇన్‌చార్జిగా నియమించుకోవడం, రౌడీషీటర్ కొట్టడంతోనే లారీడ్రైవర్ మృతిచెందడంపై సీపీ శంఖబ్రత బాగ్చి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. రౌడీషీటర్‌ను ఉద్యోగంలో పెట్టుకున్న కంపెనీ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. డ్రైవర్ మృతికి కారణమైన రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ అమలుకు ప్రతిపాదనలు తయారుచేసి పంపించాలని కంచరపాలెం పోలీసులను సీపీ ఆదేశించారు.

కాగా మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. బంధువులు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీసీ ఫుటేజీలను బహిర్గతం చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



హార్బర్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు